# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 65 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 26 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 65 26-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-

## ఏపీలో మే నెల నుంచి కొత్త పెన్షన్లు

**ఏపీలో స్పౌజ్ పెన్షన్ దరఖాస్తులకు శ్రీకారం %-% మే 1 నుంచి అమలులోకి**

అమరావతి ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాల అమలులో మరో కీలక చర్య తీసుకుంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద వితంతువులకు స్పౌజ్ పెన్షన్ అందించే నూతన విధానాన్ని ప్రాథమికంగా అమలు చేయబోతున్నారు. ఈ పథకం ద్వారా తమ భర్తను కోల్పోయిన వేలాది మంది మహిళలకు నెలనెలా ఆర్థిక భద్రత కల్పించనుంది ప్రభుత్వం. గతంలో పెన్షన్ పొందుతున్న భర్త మరణించినపుడు భార్యకు వెంటనే పెన్షన్ బదలాయింపు జరగకుండా

- తరువాయి 2లో..

## ఆర్మీకి ఉగ్రవాదుల బాంబ్ ట్రాప్

**-తృటిలో తప్పిన ప్రమాదం**

న్యూఢిల్లీ ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



జమ్మూ కాశ్మీర్‌లోని బందీపోరా జిల్లాలో శుక్రవారం ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య జరిగిన కాల్పులు ఎన్‌కౌంటర్ కు దారి తీశాయి. కుల్నార్ బాజిపోరా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా సిబ్బంది కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ సమయంలోనే ఆ ప్రాంతంలో నక్కి ఉన్న ఉగ్రవాదులు భద్రతా దళాలను చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. దీంతో సైనికులు అంతే ధీటుగా ప్రతీకార చర్యకు దిగారు. ఇరువర్గాల నడుమ పెద్ద ఎత్తున కాల్పులు జరిగాయి. ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని భారత ఆర్మీ అధికారులు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు జమ్మూ కశ్మీర్‌లో భారత సైన్యం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించింది. బిజ్‌బెహరా, త్రాల్ ప్రాంతాల్లో సైనికులు కూంబింగ్ నిర్వహించారు. బైసరన్ నరమేధంలో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్న

- తరువాయి 2లో..

## అమరావతికి ప్రధాని పర్యటన షెడ్యూల్



అమరావతి ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ప్రధాని మోదీ 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. హెలికాప్టర్ లో మధ్యాహ్నం 3.30 గంటలకు అమరావతిలోని హెలిప్యాడ్ వద్దకు చేరతారు. అక్కడి నుంచి ప్రధాన వేదిక వరకు 1.1 కి.మీ. మేర రోడ్డు షోలో పాల్గొంటారు. 15 నిమిషాల పాటు రోడ్డు షో ఉంటుంది. మధ్యాహ్నం 3.45 గంటల నుంచి 4 గంటల వరకు అమరావతి పెవిలియన్ను సందర్శిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు

- తరువాయి 2లో..

## టీడీపీ నేత వ్యాపార కార్యాలయంపై దాడి


**-బరితెగించిన వైసీపీ మూకలు**

గుడివాడ ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



గుడివాడ, ఏప్రిల్ 25(గోదావరి ప్రతినిధి): గుడివాడలో వైసీపీ మూకలు మరోసారి బరితెగించారు. జగన్ ప్రభుత్వంలో విచ్చలవిడిగా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అండ చూసుకుని దాడులకు తెగబడ్డారు. టీడీపీ నేతలపై విచక్షణ రహితంగా దాడులు చేశారు. దాడులు చేయడమే గాకుండా కేసులు పెట్టి మరీ వేధించారు. ఎంతో మంది నేతలు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు వారి ఆగడాలకు తట్టుకోలేక పోయారు. దాడులు చేయడమే గాకుండా వైసీపీ మూకలు ఎంతో మందిని పొట్టన పెట్టుకున్నాయి. కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతుండటంతో టీడీపీ నేతలు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జగన్ హయాంలో ఏపీని రణరంగంగా మార్చడంతో చూసి తట్టుకోలేకపోయిన సామాన్య ప్రజలు వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పారు. జగన్ పార్టీని కూకటివేళ్లతో సహా పెకిలించి వేశారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం చేసి వైసీపీకి సరైన గుణపాఠం చెప్పారు. అయినా కూడా వైసీపీ నేతల్లో ఏ మాత్రం మార్పు రావడం లేదు. సరికదా ఆ పార్టీ హై కమాండ్ దిగువ స్థాయి కేడర్‌ను వారించిన సందర్భాలు

- తరువాయి 2లో..



## కస్తూరి రంగన్ మృతి పట్ల సీఎం చంద్రబాబు, లోకేష్ సంతాపం

అమరావతి ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె.కస్తూరి రంగన్ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. డాక్టర్ కె.కస్తూరి రంగన్ ఒక అసాధారణమైన శాస్త్రవేత్త అని కొనియాడారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్‌గా, తొమ్మిది సంవత్సరాల పాటు భారతదేశం యొక్క అంతరిక్ష కార్యక్రమాలను విజయవంతంగా నడిపించారని అన్నారు. అంతరిక్ష శాస్త్రం కంటే మించి ఆయన సేవలు విస్తరించాయన్నారు. ఒక

- తరువాయి 2లో..

# అమరావతి రండి

## ప్రధాని మోడికి సీఎం చంద్రబాబు ఆహ్వానం

న్యూఢిల్లీ ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి ఏపీకి రావాలని ఆహ్వానించారు. మే 2వ తేదీన ఏపీలో ప్రధాని మోదీ పర్యటించనున్న నేపథ్యంలో చంద్రబాబు.. ప్రధానితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో ఏపీ పర్యటనకు సంబంధించిన విషయాల గురించి సీఎం చంద్రబాబు మోదీతో చర్చించారు. ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను మే2న ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. అమరావతి, ఏపీకి సంబంధించిన పలు అంశాలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో మాట్లాడారు. శుక్రవారం రాత్రికి ఢిల్లీలోనే చంద్రబాబు బస చేశారు. శనివారం ఉదయం సీఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి బయలుదేరి విశాఖపట్టణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వెళతారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పనుల పునఃప్రారంభానికి మే 2న రానున్నారు. అమరావతిలో ప్రధాని ఆవిష్కరించాల్సిన పనులు, మోదీ పర్యటన వివరాలపై సిఎం చంద్రబాబుకు

- తరువాయి 2లో..



## వైసీపీ ఆరోపణలను ఖండించిన ఉర్సా క్లస్టర్స్ ప్రమోటర్ హరీష్ కోయా

**-విశాఖలో ఏఐ డేటా సెంటర్‌ను పెట్టేందుకు కట్టుబడి ఉన్నాం**

**-అమెరికాలో 28 సంవత్సరాల నుండి అనేక రంగాల్లో పని చేసిన అనుభవం నాకుంది**

**-మాతృభూమిపై ప్రేమ, ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలకు ఆకర్షితులై మేము పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చాం**

అమరావతి ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గత కొన్ని రోజులుగా ఉర్సా క్లస్టర్స్ పై వైసీపీ, సాక్షి పత్రిక చేస్తున్న ఆరోపణలను ఉర్సా క్లస్టర్స్ ప్రమోటర్ హరీష్ కోయా తీవ్రంగా ఖండించారు. శుక్రవారం నాడు హరీష్ కోయా ఒక వీడియో విడుదల చేశారు. 28 సంవత్సరాల నుంచి ఐటీ, సప్లై చైన్,

- తరువాయి 2లో..



## సిక్కింలో విరిగిపడిన కొండచరియలు

**చిక్కుకున్న 1000 మంది పర్యాటకులు**

న్యూఢిల్లీ ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఈశాన్య భారతదేశంలోని ఉత్తర సిక్కింలో ప్రకృతి వైపరీత్యం కారణంగా పెద్ద సంఖ్యలో పర్యాటకులు చిక్కుకుపోయారు. మున్షితాంగ్ ప్రాంతంలోని లాచెన్-చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ వద్ద గురువారం రాత్రి భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ విపత్తు సంభవించింది. గాంగ్టక్ నుండి చుంగ్తాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో నిరంతర వర్షాలు కురుస్తున్నందున శుక్రవారం ఉదయానికి పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఆయా ప్రాంతాలకు సందర్శకులకు అనుమతిని రద్దు చేశారు అధికారులు. కొండచరియలు విరిగిపడిన కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 1,000 మంది పర్యాటకులు చిక్కుకుపోయారని పోలీసు అధికారులు ధృవీకరించారు. కఠినమైన వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరిగిపడటం వల్ల చుంగ్‌థాంగ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దాదాపు 200 పర్యాటక వాహనాలు చిక్కుకుపోయాయి. దీంతో అధికారులు ప్రయాణికులను సమీపంలోని గురుద్వారాకు తరలించి బస చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకూ ఉత్తర సిక్కింకు పర్యాటకులను పంపవద్దని అధికారులు అన్ని టూర్ ఆపరేటర్లను ఆదేశించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పరిస్థితులు మెరుగుపడే వరకు సందర్శకులు, స్థానికులు నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## 9 నెలలు.. రూ 100 కోట్ల అభివృద్ధి

కాకినాడ, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గడచిన 9 నెలల కాలంలో పిఠాపురం నియోజక వర్గంలో దాదాపు 100 కోట్ల పైబడి నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ,స్థానిక ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం ఆయన తన నియోజక వర్గంలోని ఉప్పాడ, పిఠాపురంలలో పర్యటించి పలు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన తొలుత 2 కోట్ల నిధులతో టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కోటీ 60 లక్షలు నిధులు సమకూర్చగా, మరో 40 లక్షలు సిఎస్ఆర్ నిధులు వినియోగించడం జరుగుతుందన్నారు. ఉప్పాడ గ్రామం సర్వే నెం 23/1 లోని ఎకరం విస్తీర్ణంలో ఈ కళ్యాణ మండపం 9,072.43 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో 630 మంది కూర్చునేందుకు

- తరువాయి 2లో..





## సంపాదకీయం

# మానవతావాది

మానవతావాదిగా పోప్ ఫ్రాన్సిస్‌ది సమకాలీన ప్రపంచంపై చెరగని ముద్ర. అందుకే ఆయన విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ విశ్వవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటలీలో నియంత ముస్సోలిని అరాచకాలు భరించలేక అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ వలస వచ్చిన ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జార్జ్ మారియో బెర్గోగ్లియో నైట్‌క్లబ్ బౌన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ జీసస్‌లో చేరి కాథలిక్ ప్రీస్ట్ నుంచి అత్యున్నత పోప్ పదవిని చేపట్టడానికి పేదల పట్ల కరుణ, దయ, వినమ్రతే ప్రధాన కారణం. అర్జెంటీనా నుంచి తొలుత బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా చరిత్రకెక్కిన ఆయన తన పేరును పేదల కోసం పాటుపడిన సెయింట్ ఫ్రాన్సిస్‌లోని ఫ్రాన్సిస్‌గా మార్చుకోవడం మానవత్వానికే తన ప్రాధాన్యత అని చాటిచెప్పడమే. విలాసవంతమైన రాజభవనాల్లో, అడుగడుగునా హంగు ఆర్భాటాలతో జీవించే మత పెద్దలందరికీ ఫ్రాన్సిస్ భిన్నం. జీవితాంతం నిరాడంబరతను చాటిచెబుతూనే ఉండటం ప్రత్యేకత. వృద్ధులు, ఖైదీల కాళ్లు కడిగి ముద్దుపెట్టుకోవడం అణగారిన వర్గాలకు సన్నిహితంగా, అండగా ఉండాలనే సందేశమే. వాటికన్‌లో తన తొలి ఈస్టర్‌కు ముందుగా ఇటలీ ద్వీపకల్పమైన లాంపెడుసాను ఎంపిక చేసుకోవడమే కాదు%ౌ% 88వ ఏట%ౌ% తీవ్ర అస్వస్థతతో ఉన్నా, తన మరణానికి ముందురోజున ఈస్టర్ నాడూ సామాన్యులను కలుసుకోవడం ఆయన విశిష్టత. యూరప్ చేరుకునేందుకు వేలాదిమంది శరణార్థులు ప్రవేశించే లాంపెడుసాను ఎంచుకోవడం ప్రపంచీకరణ పేదల పట్ల చూపే ఉదాశీనతకు నిరసన. ప్రమాదకరంగా సముద్ర ప్రయాణాలు చేస్తూ మరణిస్తుండటం పట్ల ఆందోళన. వాతావరణ మార్పుల వల్ల పేద దేశాలకు జరుగుతున్న అన్యాయానికి ధనిక దేశాలదే బాధ్యత అని కుండబద్దలు కొట్టిన, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా బయటకు రావడాన్ని నిరసించిన మరో మత పెద్ద మనకు కనిపిస్తారా? అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన తొలి పోప్ కూడా ఫ్రాన్సిసే. భూమిని, ప్రకృతిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రపంచంలోని అత్యంత ధనిక దేశానిదేనన్నారు. మెక్సికోకు వ్యతిరేకంగా సరిహద్దు గోడను ట్రంప్ తన తొలి విడత పదవీ కాలంలో నిర్మించడం క్రైస్తవ విరుద్ధమైన చర్య అంటూ ఖండించారు. ఇటీవల శరణార్థులను అమానవీయంగా సంకెళ్లు వేసి తరలించడంపైనా గళమెత్తారు. ప్రపంచ దేశాల మధ్య సయోధ్య, ప్రేమ, సత్సంబంధాల పెంపులోనూ ఆయన ముద్ర ఉంది. అమెరికా, క్యూబాల మధ్య చారిత్రక సయోధ్యకు, కొలంబియాలో శాంతికి తన వంతు ప్రయత్నాలు చేశారు.

మత బోధకులు పిల్లల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంపై సమాజానికి క్షమాపణ చెబుతూనే%ౌ% వారి పట్ల, అవినీతికి పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. మతానికి చెడ్డపేరు వస్తుందనో, వారి పలుకుబడికి భయపడో అలాంటి ఘటనలను దాచిపెట్టాలని భావించే మత ఛాందసులకు ఆయన వైఖరి భిన్నం. మరణ శిక్షను, పచ్చి మితవాద భావజాలాన్ని నిరసించారు.

యుద్ధాలను మానవతకు ఓటమిగా నిర్వచించడంతోపాటు మూడో ప్రపంచయుద్ధం తప్పదంటూ హెచ్చరించారు. డబ్బు కోసం మనుషులను కాల్చేసే వ్యాపారం అంటూ యుద్ధాలు చేసే దేశాలనూ, ఆయుధాలిచ్చే దేశాలనూ ఈసడించారు. యుద్ధాలు, అరాచకాల వల్ల కాందిశీకులుగా మారిన వారికి కాథలిక్ సంస్థల ద్వారా సహాయాన్ని అందించే ప్రక్రియను చేపట్టారు. ఇజ్రాయిల్, పాలస్తీనా, ఉక్రెయిన్ తదితర దేశాల అత్యున్నత స్థాయి బృందాలతో మాట్లాడి, యుద్ధాలను ఆపివేయాలంటూ శాంతి సందేశాన్నిచ్చారు. క్రైస్తవులు, ముస్లిముల మధ్య మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందీ ఆయనే. మహిళల హక్కుల కోసం గళమెత్తడంతోపాటు చేతల్లోనూ తెగువ చూపారు. రోమన్ కాథలిక్‌లలో ఉన్నత స్థానాల్లో పురుషులకే స్థానం కల్పించే సాంప్రదాయానికి స్వస్తి పలికి, అనేక మంది మహిళలకు ఉన్నత స్థానాలిచ్చారు. ఇటువంటి అనేక చర్యలను సాంప్రదాయ వాదులు తొలి నుంచీ నిరసిస్తూనే ఉన్నా%ౌ% ముందడుగేసిన చరిత్ర ఆయనదే. పేరు ప్రఖ్యాతులు, పోప్‌గా లభించే అధికారాన్ని అనుభవించడం కన్నా, సామాన్య ప్రజల కష్టసుఖాలు తనవిగా భావించి, సమాజానికి మేలు చేయాలని భావించిన ఆయన కాథలిక్ సమాజానికే కాదు, మత పెద్దలందరికీ ఆదర్శనీయం!

# పిఠాపురంలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

## -ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్



**పిఠాపురం, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ఎన్నికల వేళ ఇచ్చిన మరో హామీని నెరవేర్చారు. పిఠాపురంలో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. ఈ ఘట్టంతో ఎన్నికల హామీని నిలుపుకున్నట్లయ్యింది. శుక్రవారం నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ ఆస్పత్రికి శంకుస్థాపన చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉంది. అయితే, ఎన్నికల వేళ దీనిని 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానంటూ పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ఆసుపత్రిలో రెండు కొత్త బ్లాకులు, ఓపీ వార్డు, మార్చురీ వార్డు, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, అధునాతన మెషీన్లు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం ద్వారా పిఠాపురం నియోజకవర్గంలోని 3 లక్షల మంది ప్రజలతోపాటు ఆరు పరిసర మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఆసుపత్రి నిర్మాణం చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెల కాలంలోనే నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఆర్మీకి ఉగ్రవాదుల బాంబ్ ట్రాప్

ఉగ్రవాదుల జాడను కనుగొనేందుకు సోదాలు చేపట్టారు. కానీ, ఈ విషయం తమకు ముందే తెలుస్తున్నట్లు ఆర్మీకి రివర్స్ స్కెచ్ వేశారు టెర్రరిస్టులు. వారి ఇళ్లను వెతుక్కుంటూ వెళ్లిన సైనికులను బాంబుల ఉచ్చులో దింపేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, అనుమానస్పదంగా అనిపించి ముందే సురక్షిత ప్రాంతానికి చేరుకోవడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు మన జవాన్లు. పుల్వామా జిల్లాలోని మోంఘమా ప్రాంతంలోని ఆసిఫ్ ఇంట్లో, బిజ్‌బెహారాలోని అదిల్ థోకర్ అలియాస్ అదిల్ గురి ఇంట్లో బాంబు పేలుళ్లు సంభవించాయి . బైసరన్ లోయ మారణకాండకు వీరే సూత్రధారులని నిఘా వర్గాలు చెబుతున్నాయి. లష్కరే తోయిబా స్థానిక కమాండర్ గా ఆసిఫ్ షేక్ పని చేస్తుండగా.. లష్కరే తోయిబాకే చెందిన ఆదిల్ థోకర్ 2018లో చట్టబద్ధంగా పాకిస్తాన్‌కు వెళ్లి ఉగ్రవాద శిక్షణ పొందాడు. గతేడాదే స్వగ్రామానికి తిరిగి వచ్చి దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. చాలాకాలం నుంచే ఆదిల్ నిఘా సంస్థల రాడార్‌లో ఉన్నాడని అధికారులు చెబుతున్నారు.

## అమరావతికి ప్రధాని పర్యటన షెడ్యూల్

సభ జరుగుతుంది. అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మోదీ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.10 గంటలకు హెలికాప్టర్లో బయల్దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 5.20కి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి ఢిల్లీ వెళతారు. ప్రధాని మోదీ సభ కోసం మూడు వేదికలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదికపై ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా మొత్తం 20 మంది ఆసీనులవుతారు. మిగతా వీవీఐపీల కోసం మరో వేదిక ఏర్పాటు చేస్తారు. దానిపై 100 మంది ఉంటారు.

## టీడీపీ నేత వ్యాపార కార్యాలయంపై దాడి

కూడా లేకపోవడంతో విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నారు. తాజాగా గుడివాడలో టీడీపీ నేతకు సంబంధించిన కార్యాలయంపై దాడి చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. గుడివాడ మార్కెట్ యార్డు వద్ద తెలుగుదేశం నేతకు చెందిన లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంపై గురువారం అర్ధరాత్రి మూకుమ్మడిగా వైసీపీ మూకలు దాడి చేశారు. ఈ కార్యాలయంలోని ఫర్నిచర్, సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. వైసీపీ నేత లింగం చిట్టిబాబు, తన అనుచరులు మరో 15 మంది ఈ దాడిలో పాల్గొన్నట్లు ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు గుర్తించారు. అర్ధరాత్రి కార్యాలయం పరిసరాల్లో విధ్వంసం సృష్టించారు. కార్యాలయంలో రూ. 3 లక్షల నగదు, విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు అడుసుమిల్లి శ్రీనివాస్ తెలిపారు. దాడి జరుగుతున్నప్పుడు అడ్డుకోబోయిన స్థానికులను చంపుతామంటూ బెదిరించారని అడుసుమిల్లి శ్రీనివాస్ తెలిపారు. అకారణంగానే కార్యాలయంపై దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని అడుసుమిల్లి శ్రీనివాస్ కోరారు. పోలీసులకు ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు అడుసుమిల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. దాడి చేసిన వారిని గుర్తించడానికి సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దాడికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయం తెలియడంతో గుడివాడలోని టీడీపీ నేతలు నిరసనకు దిగారు.

## కస్తూరి రంగన్ మృతి పట్ల సీఎం చంద్రబాబు, లోకేష్ సంతాపం

విద్యావేత్తగా, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భారతదేశంలోని విద్యా భవిష్యత్తును ఒక రూపు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్ పురస్కారం ఆయనకు లభించిందన్నారు. భారతదేశపు అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతరిక్ష- ఆధారిత హై ఎనర్జీ ఆస్ట్రానమీ ఒబ్జర్వేటరీని కస్తూరి రంగన్ ఆధ్వర్యంలో ముందుకు తీసుకు వెళ్లారని అన్నారు. ఇది ఆయన నాయకత్వంలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి లభించాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

ఇస్రో మాజీ ఛైర్మన్ కె.కస్తూరి రంగన్ (84) కన్ను మూశారన్న వార్త తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా రంగంలో విశేష సేవలు అందించిన కస్తూరి రంగన్ మృతి దేశానికి తీరనిలోటన్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్?గా ఉన్న కస్తూరిరంగన్... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 2020 జాతీయ విద్యా విధానం రూపకల్పన కమిటీ ఛైర్మన్?గా విశేష సేవలందించారని తెలిపారు. 2003-09 మధ్య రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన కస్తూరిరంగన్ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారన్నారు. కస్తూరి రంగన్ మృతికి ఘన నివాళులు అర్పిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ (84) శుక్రవారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. బెంగుళూరులోని నివాసంలో తుది శ్వాస విడిచారు. ఇస్రో చైర్మన్ అంతరిక్ష రంగంలో భారత్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి కస్తూరి రంగన్. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ఇస్రో చైర్మన్‌గా పని చేసిన ఆయన.. ఆగస్టు 27, 2003లో పదవీ విరమణ చేశారు. కస్తూరి రంగన్ మృతి పట్ల ప్రధాని మోదీతో పాటు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

## అమరావతి రండి

మంత్రి నారాయణ, సిఆర్డీఏ కమీషనర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సుమారు లక్ష కోట్ల రూపాయలు పనులను ప్రధాని అమరావతిలో పట్టాలు ఎక్కించనున్నారు. వివిధ పనులకు శంఖుస్థాపనలు చేయనున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతిలో పైలాన్ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పైలాన్‌పై ఏపీ రాష్ట్ర చిహ్నం బంగారు వర్ణంలో ఉన్న పూర్ణకుంభంతో ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఆరుమీటర్లు ఎత్తుతో పైలాన్ ఏర్పాట్లు ఉండనున్నాయి. పైలాన్‌పై కార్యక్రమ, అతిథుల వివరాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## వైసీపీ ఆరోపణలను ఖండించిన ఉర్సా క్లస్టర్స్ ప్రమోటర్ హరీష్ కోయా

ఇన్ఫ్రా స్ట్రక్చర్ మేనేజ్మెంట్ రంగాల్లో విజయవంతంగా బిజినెస్‌లను రన్ చేస్తూ 100ం మిలియన్ డాలర్ల నెట్ వర్త్ ఉన్నట్లు ప్రకటించారు. తన అనుభవంతో ఏఐ రంగంలో కూడా అడుగుపెట్టి అనేక మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని అనుకున్నట్లు తెలిపారు. ఉర్సా సంస్థలో ఐటీ రంగంల్లో ఎంతో అనుభవజ్ఞులైన టీమ్ ఉన్నట్లు ఆయన తెలిపారు. మాతృభూమిపై తమకున్న ప్రేమతో, అలానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలకు ఆకర్షితులై ఆరుగురు ఎన్నారైలు కలిసి విశాఖలో ఏఐ డేటా సెంటర్‌ను పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. సంస్థ పూర్వపరాలను చూసి ప్రభుత్వం కూడా ఎంతగానో ప్రోత్సహించినట్లు ఆయన వివరించారు. యువతకు మేలు చేద్దామని మేము వస్తే అనుకోని పరిణామాలు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఉర్సా సంస్థపై అనేక తప్పుడు ఆరోపణలు చేయడం భాధాకరం అని ఆయన అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రెండేళ్ళలో 100 మెగా వాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వం తమకిచ్చిన నిర్దేశిత సమయంలో కల్లా ప్రాజెక్టును పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు అందిస్తామని వీడియా సందేశం ద్వారా ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## 9 నెలలు.. రూ 100 కోట్ల అభివృద్ధి



సరిపడే హాలు, 180 మంది కూర్చుని భోజనం చేసేందుకు వీలైన డైనింగ్ హాలు, వధూవరుల గదులు, టాయిలెట్లు, పార్కింగ్ ఏరియా, కాంపౌండ్ వాల్ వంటి సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నారు. గొల్లప్రోలులోని 150 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ సీతారామ స్వామి ఈ దేవాలయ ప్రాంగణంలో ప్రాకార మండపాన్ని కోటీ 32 లక్షలు దేవదాయ శాఖ సిజిఎఫ్ గ్రాంటు, 44 లక్షలు ప్రజా విరాళాలతో నిర్మించేందుకు పనులు ప్రారంభిస్తూ ఆయన శిలాఫకాన్ని, గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని 225 సంవత్సరాల పురాతన శ్రీ సీతారామ స్వామి దేవాలయ ప్రాంగణంలో 48 లక్షలు దేవాదాయ శాఖ సిజిఎఫ్ నిధులు, 5 లక్షలు దేవాలయ నిధులతో కాలక్షేప మండపం, రథశాల నిర్మాణ పనులను ప్రారంభించి ఇక్కడే మూడు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఆనంతరం పిఠాపురంలోని అంబెద్కర్ కమ్యూనిటీ హాలులో పిఠాపురం నియోజక వర్గంలో నిర్వహిస్తున్న 24 శిక్షణా కేంద్రాల ద్వారా టైలరింగ్ లో శిక్షణ పొందిన బిసి,కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన 3,456 మంది మహిళలకు 8 కోట్ల 64 లక్షల రూపాయల విలువైన కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అలాగే అకాల వర్షాల నుండి రైతులు ఉత్పత్తులను కాపాడుకునేందుకు జిల్లా కలెక్టర్ 26 లక్షల నిధులతో కొనుగోలు చేసిన 2వేల టార్పాలిన్లను, వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న 14 రోటోవేటర్లు, 39 పవర్ టిల్లర్లు, 50 స్ప్రేయర్లను రైతులకు పంపణీ చేశారు. అలాగే పిఠాపురం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో 34 కోట్ల తో నూతనంగా అదనపు భవనాల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే పల్లెపండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం సమన్వయంతో 17 కోట్ల 67 లక్షల నిధలతో పిఠాపురం మండలంలోను, 8 కోట్ల 28 లక్షల నిధులతో యు.కొత్తపల్లి మండలంలోను, 3 కోట్ల 78 లక్షల నిధులతో గొల్లప్రోలు మండలంలోను నిర్వహించిన సిమ్మెంటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పిఠాపురం నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టనున్న కార్యక్రమాల ప్రణాళికలను వివరించారు.

ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఇన్చార్జి కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనిపాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పి.హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి ట్రస్ట్ బోర్డు మెంబరు జ్యోతుల నెహ్రూ కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్విఎస్ఎన్ వర్మ, పెండెందొరబు, ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్పి జి.బిందుమాధవ్, ఎఎస్పిలు ఎజివి భాస్కరరావు, మనీష్ పాటిల్ దేవరాజా ఎండోమెంట్స్ డిసి కె.రమేష్, పాడా పిడి ఎ.చైత్రవర్షిణి, డ్వామాపిడి పి.వెంకటలక్ష్మి, వ్యవసాయశాఖ జేడి ఎన్.విజయకుమార్, బిసికార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, డియంహెచ్ఓ జె.నరశింహనాయక్, పార్టీ ప్రముఖులు మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ సి ఎం మీడియాతో మాట్లాడారు.

ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు, పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను ఏరియా హాస్పిటల్ గా అభివృద్ధి చేయడం జరిగిందని. దీనికి సంబంధించి రూ.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అదే విధంగా నూతనంగా రెండు కొత్త బ్లాకులు,ఒపి వార్డు, మార్చురీ వార్డు, డయాలసిస్ , బ్లడ్ బ్యాంక్, ఆధునాతనిక మెషీన్లు అందుబాటులోకి రావడం జరుగుతుందన్నారు అలానే 66 కొత్త పోస్టులు కూడా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నూతనంగా పలు విభాగాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా పిఠాపురం నియోజకవర్గంలోని 3 లక్షల ప్రజలకే కాకుండా చుట్టూ ప్రక్కల గల 6 మండలాల ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. గతంలో గొల్లప్రోలు సభలో ఇచ్చిన హామీ మేరకు, ఉప్పాడ కొత్తపల్లి మండలంలో సామాన్య ప్రజలు తక్కువ ఖర్చుతో వివాహాలు జరుపుకునేందుకు అవకాశం కల్పిస్తూ, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో టిటిడి కళ్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసి, ప్రజల సేవలోకి తీసుకురావడం జరుగుతుందని,దీని ద్వారా చుట్టు పక్కన గ్రామాలలో గల సుమారు పది వేల కుటుంబాలకు అతి తక్కువ రుసుముకు వివాహం చేసుకునే విచ్చేసే వేలాది మంది భక్తులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు

## ఏపీలో మే నెల నుంచి కొత్త పెన్షన్లు

ఆలస్యం అవుతూ ఉండేది. కానీ ఇప్పుడు నవంబర్ 2023 నుంచి అమలులోకి వచ్చిన స్పౌజ్ కేటగిరీ ద్వారా అలాంటి వితంతువులకు వెంటనే సాయం అందేలా చర్యలు చేపట్టారు. ఏపీ ప్రభుత్వం స్పౌజ్ కేటగిరీకి చెందిన దరఖాస్తులను ఏప్రిల్ 25, 2025 నుంచి గ్రామ, వార్డు సచివాలయాలలో స్వీకరిస్తోంది. అర్హత కలిగిన వారు తమ భర్త మృతి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఇతర సంబంధిత పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 30లోగా దరఖాస్తులు సమర్పించినవారికి మే 1 నుంచే పెన్షన్ అందించనున్నారు. ఎవరైనా ఈ తేదీ లోపు నమోదు చేయలేకపోతే, వారు జూన్ 1 నుంచి పింఛన్ పొందవచ్చు. ఈ విధానం వల్ల మరణించిన వారి భార్యలకు ఇకపై వేచి ఉండాల్సిన అవసరం లేకుండా తక్షణం పెన్షన్ అందేలా మారింది.

### 89,788 మంది కొత్త లబ్ధిదారులకు మే నుంచి రూ.4000 పెన్షన్

ఈసారి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వివరాల ప్రకారం, 89,788 మంది స్పౌజ్ లబ్ధిదారులు మే నెల నుంచి రూ.4000 పెన్షన్‌ను పొందనున్నారు. ఇది ఏకంగా నెలకు రూ. 35.91 కోట్ల అదనపు భారం ప్రభుత్వానికి కలిగించినా, సామాజిక న్యాయ పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. డిసెంబరు 1, 2023 నుంచి అక్టోబరు 31, 2024 మధ్య కాలంలో భర్త మృతి చెందిన వితంతువులు ఈ పథకానికి అర్హులు.

### సామాజిక న్యాయం కోసం మానవీయ నిర్ణయం

ఈ పథకం అమలుతో వితంతువులు తక్షణ ఆర్థిక సాయం పొందే అవకాశం లభిస్తుంది. ఎలాంటి రాజకీయ ప్రేరణలకన్నా ముందుగా మానవతా దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో ఎంతో మంది బాధితులు పింఛన్ బదిలీ కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఇప్పుడు స్వల్ప వ్యవధిలోనే గుర్తింపు, ధ్రువీకరణ జరిగి, మే నెల నుంచే సాయం అందుతుంది.

### అర్హతకు కావలసిన పత్రాలు ఇవే

అర్హులుగా పరిగణించబడేందుకు భర్త మృతి ధ్రువీకరణ పత్రం, అర్హురాలి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు వంటి ఆధారాలు అవసరం. వీటిని సమర్పించేందుకు ఎలాంటి జటిల ప్రక్రియ లేకుండా సులభతరం చేశారు. సచివాలయ అధికారులు దరఖాస్తుల్ని స్వీకరించి త్వరితంగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.

### మహిళా సాధికారతకు బలమైన అడుగు

ఈ పథకం ద్వారా వితంతువుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, వారి జీవితంలో కొత్త ఆశలు జగిలిపోతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది ఒక సామాజిక న్యాయ చర్య మాత్రమే కాకుండా, మహిళా సాధికారతకు దోహదపడే కీలకమైన పథకంగా నిలుస్తుంది.

# నాటికలను బ్రతికించుకుందాం..

**జాతీయస్థాయి నాటికల పోటీలను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ నాగరాణి**

**సినీనటులు రావు రమేష్ కు ఆత్మీయ చైతన్య పురస్కారం, రచయిత మిశ్రో కు చుక్కన రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి మణి బాలకు పెనుబోతుల రంగస్థల చైతన్య పురస్కారం**







భీమవరం,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నాటికలను బ్రతికించుకుందామని, నాటకాలతోనే సమాజ మార్పు వస్తుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం డిఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో చైతన్య భారతి 18వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలను డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, సినీనటులు రావు రమేష్ లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిప్యూటీ స్పీకర్ ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ కళలను ఆధారించాలంటే అప్పట్లో రాజులు ఉండేవారని, ఇప్పుడూ ప్రభుత్వాలు చేస్తున్నాయని, కానీప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని,నాటక రంగానికి ప్రభుత్వం సహకారం అందించాలని అన్నారు. నాటక రంగానికి ఆదరణ తగ్గుతుందని, నాటక రంగాన్ని బ్రతికించుకుందామని అన్నారు. సినిమా ప్రపంచంలో నాటక రంగాలు కొట్టుకుపోతున్నాయని, అయిన నాటక రంగాన్ని బ్రతికిస్తూ ఇటువంటి జాతీయస్థాయి నాటక పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ డిటిటల్ కాలంలో కూడా నాటక రంగాన్ని రక్షించడం గొప్ప విశేషమని, ప్రజా చైతన్యానికి ప్రామాణికంగా నిలిచేవి నాటికలేనని అన్నారు. నాటికల వైభవాన్ని తీసుకురావడానికి ఈ పోటీలను గత 17 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, ఈనెల 27 వరకు జరుగుతాయని, 4 రోజుల్లో 9 నాటికలను ప్రదరిస్తున్నామని అన్నారు. అనంతరం సినీ నటులు రావు రమేష్ కు ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటులు రచయిత మిశ్రోకు చుక్కన సత్యనారాయణ రాజు రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి మణిబాల కు పెనుబోతుల శేషగిరిరావు హార్దిక చైతన్య పురస్కారాలతో సత్కరించారు. అనంతరం కళానికేతన్ కట్రపాడు వారిచే "కిడ్నాప్, మైత్రి కళా నిలయం హైదరాబాద్ వారిచే బ్రహ్మ స్వరూపం నాటకాలు అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిఎన్నార్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, చిలుకూరి నరసింహరాజు, మంతెన రామ్ కుమార్ రాజు, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాస్, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, పేరిచర్ల లక్ష్మణ వర్మ, బోండా రాంబాబు, కాట్రెడ్డి సత్యనారాయణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, పెన్నడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### మే2 వతేదీన గన్నవరం విమానాశ్రయానికి

# విచ్చేయునున్న ప్రధానమంత్రి

### కట్టుదిట్టమైన భద్రత చర్యలు - పరిశీలించిన కలెక్టర్



మచిలీపట్నం, ,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వచ్చే మే నెల 2 వ తేదీన ప్రధానమంత్రి గన్నవరం విమానాశ్రయానికి విచ్చేయుచున్న సందర్భంగా అన్ని రకాల పనులు, ఏర్పాట్లు ఈనెల 28వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర కార్యక్రమ నోడల్ అధికారి, రాష్ట్ర ఆరోగ్యము కుటుంబ సంక్షేమ కమిషనర్ వీర పాండ్యన్ అధికారులను ఆదేశించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వచ్చే మే నెల 2 వ తేదీన అమరావతిలో రాజధాని పునః నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వస్తున్న దృష్ట్యా శుక్రవారం రాష్ట్ర కార్యక్రమ నోడల్ అధికారి, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావులతో కలసి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో చుట్టూ ముందస్తు భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. తొలుత వారు అంతర్జాతీయ టెర్మినల్ వద్ద విఐపి విరామశాల, ఆగమనం, నిర్గమన ప్రదేశాలు పరిశీలించారు. అనంతరం రాష్ట్ర నోడల్ అధికారి జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ లతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశంనిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విమానాశ్రయంలోనూ ప్రధానమంత్రి పర్యటించే మార్గంలో అంతట కట్టుదిట్టమైన భద్రత ప్రణాళికను రూపొందించామన్నారు. కాన్వాయ్ వాహనాలు సజావుగా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే హెలికాప్టర్లకు ఇంధనం నింపే ఏర్పాట్లు చేశామన్నారు. ప్రముఖుల భద్రత కోసం 8 మంది డిఎస్పీలను, ఇద్దరు అడిషనల్ ఎస్పి తో పాటు తాను బందోబస్తు ఏర్పాటు పర్యవేక్షిస్తామన్నారు. బందోబస్తు లో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ బలగాలు ఉంటాయన్నారు. గన్నవరం విమానాశ్రయం నుండి విజయవాడ మీదుగా అమరావతికి వెళ్లేందుకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బయట ప్రాంతాల నుండి వచ్చే వాహనాలను ప్రధాన రహదారి లోకి కాకుండా వేరే మార్గాల్లో దారి మళ్ళిస్తున్నామన్నారు. వాహనాల పార్కింగ్ కోసం అని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు ఈ సమావేశంలో విమానాశ్రయం డైరెక్టర్ ఎం ఎల్ కె రెడ్డి, గుడివాడ మచిలీపట్నం ఉయ్యూరు ఆర్డీఓలు బాలసుబ్రమణ్యం స్వాతి, హేలా షారోన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# హైబ్రిడ్ తీవ్రవాదం

**ఉగ్రవాద కర్కశ దాడితో పహల్గామ్ ప్రశాంతత భగ్నమైంది. కశ్మీర్ లోయలో శాంతి ఇప్పటికీ దైవాధీనమే! శత్రువుల తుపాకులు ఎంత ప్రమాదకరమైనవో... ఉదాసీనత, తప్పుడు అంచనాలు కూడా అంతే ప్రమాదకరమైనవి. పౌరుల మీద కాదు, ఇండియా విశ్వసనీయత మీద జరిగిన దాడి ఇది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ దేశంలో పర్యటిస్తున్న సందర్భంలో దెబ్బ తీయడాన్ని ఇంకెలా భావించాలి? ఇదొక కొత్త రకం మిలిటెన్సీ.**



కశ్మీర్ వినూత్న విపత్తును ఎదుర్కొంటోంది. రమారమి 60 మంది విదేశీ ఉగ్రవాదులు కశ్మీర్ లోయలో మాటు వేసి ఉన్నారని నిఘా వర్గాల అంచనా. వీరిలో సగం మంది టీఆర్ఎఫ్ సంబంధీకులే. ఇది లష్కర్%-%ఎ%-తోయిబాకు ముసుగు సంస్థ. ప్రపంచం కళ్లు గప్పేందుకు, స్థానిక సంస్థగా మభ్యపెట్టే పేరుతో వ్యవహారం నడిపిస్తోంది.

### భౌతిక గస్తీ కీలకం

టీఆర్ఎఫ్ తదితర గ్రూపులు హైబ్రిడ్ తీవ్రవాదాన్ని అవలంబిస్తున్నాయి. అందుకే ఇవి మరింత ప్రమాదకరమైనవి. తుపాకుల వంటి మారణాయు ధాలలో శిక్షణ పొంది, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి అధీన రేఖ దాటి వచ్చే దుండగులపై ఈ కొత్త తరహా ఉగ్రసంస్థలు ఆధార పడవు. బదులుగా స్థానికులనే 'రాడికలైజ్' చేసి వారిని ఉపయోగించు కుంటాయి. వీరికి పిస్టల్స్ లేదా గ్రనేడ్స్ సమకూరుస్తాయి.

వీటితో లక్ష్యాలపై దాడి చేసి వెంటనే జనంలో కలిసిపోతారు. వీరు రెండోసారి మళ్లీ దాడులకు పాల్పడరు. కాబట్టి ఎలాంటి డిజిటల్ ఆధారాలూ ఉండవు. దాడులూ ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటాయి. కాబట్టి 'సెక్యూరిటీ గ్రిడ్స్' పసి గట్టలేవు. సంప్రదాయ నిఘా, పోలీసు వ్యవస్థలను ముప్పుతిప్పలు పెట్టే రహస్య తీవ్రవాదం ఇది.

నిజానికి వాన్స్ వంటి హైప్రొఫైల్ వ్యక్తులు పర్యటనకు వచ్చినప్పుడు అన్ని సున్నిత ప్రాంతాలపై నిఘా పకడ్బందీగా ఉండాలి. అలా జరగలేదు. ముప్పు అవకాశాల మదింపు, ముందస్తుగా బలగాల మోహరింపు వంటి చర్యలు తీసుకోవ డంలో మునుపటి క్రియాశీలత్వం కొరవడింది. ప్రాంతాల వారీగా ముమ్మర గస్తీ నిర్వహించే విధానం సడలిపోయింది.

మరీ ముఖ్యంగా 24/7 ఎలక్ట్రానిక్ నిఘా కింద లేని ప్రాంతాల్లో ఈ ఉదాసీనత ఆందోళనకరమైన విషయం. డ్రోన్ సమాచారం, జియో ఫెన్సింగ్ ఏర్పాటు పర్వత మార్గాల భద్రతకు చాలవు. పర్వత ప్రాంతాల్లో భౌతిక గస్తీకి ప్రత్యామ్నాయం లేదు. డ్రోన్లు స్కాన్ చేస్తాయి, కెమెరాలు రికార్డు చేస్తాయి, సమాచార నిఘా వ్యవ స్థలు హెచ్చరిస్తాయి. కాదనలేం. కానీ క్షేత్రస్థా యిలో భౌతిక ఉనికి, అంతర్దృష్టికి ఇవి ప్రత్యా మ్నాయం కావు.

### స్థానిక నిఘా వ్యవస్థ

విద్రోహ నిరోధక వ్యవస్థను తక్షణం బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. దుర్ఘటనను ప్రతిఘ టించడం కాకుండా ముందుగానే దాన్ని అరికట్టే దిశగా మార్పు రావాలి. ఇందులో భాగంగా శాశ్వత గస్తీ యూనిట్లు, రొటేషనల్ నిఘా బృందాలు ఏర్పాటు చేయాలి. ఈ సందర్భంగా, చురుకైన కౌంటర్ ఇంటెలిజన్స్ గ్రిడ్ (సీఐ గ్రిడ్) చాలా ముఖ్యమైంది. ఉరి, పుల్వామా దాడుల అనంతరం చురుగ్గా పనిచేసి ప్రశంసలు పొందిన ఈ గ్రిడ్ ఇప్పుడు బలహీనపడినట్లు ఉంది. దీనిపై ఎలాంటి రాజకీయ సంకోచాలూ లేకుండా కఠినమైన సమీక్ష జరగాలి.

స్థానికుల సాయంతో నిఘా పెట్టే వ్యవస్థ ఎప్పుడో విచ్ఛిన్నమైంది. దాని పర్యవసనాలు ఎలా ఉంటాయో ఇప్పుడు తెలుస్తోంది. హైబ్రిడ్ టెర్రరిస్టులు సంప్రదాయ ఉగ్రవాద నెట్ వర్క్ల నుంచి వచ్చిన వారు కారు. వారి నియామకాలు స్వల్పకాలానికి పరిమితమై ఉంటాయి. తరచూ ఆన్లైన్లోనే జరిగిపోతుంటాయి. వారికి వన్ టైమ్ ప్రాతిపదికన విద్రోహ లక్ష్యాలు అప్పగిస్తారు. ఉగ్రవాద స్థావ రాల్లో తల దాచుకోరు. కోడెడ్ ఫోన్ కాల్స్ చేయరు.

కాబట్టి, లోతైన రియల్ టైమ్ నిఘా అవసరమ వుతుంది. మొహల్లాలు, స్కూళ్లు, మదర్సాలు, మార్కెట్ల నుంచి గుట్టుగా సమాచారం రాబట్టాలి. టెక్నా లజీకి దాని ప్రాధాన్యం దానికి ఉంటుంది. అయితే, కశ్మీర్ పరోక్ష యుద్ధం (షాడో వార్)లో స్థానికుల నుంచి సమాచారం రాబట్టే నిఘా వ్యవస్థను మరే ఇతర వ్యవస్థా భర్తీ చేయలేదు. స్థానిక ఇన్ఫార్మర్ల విశ్వాసం చూరగొనడం, లోప్రొఫైల్ క్షేత్రస్థాయి ఏజెంట్లను ఉపయోగించడం తప్పనిసరి. ఉగ్రవాద వ్యూహాల ముందస్తు గుర్తింపునకు ఈ వ్యూహం వెన్నెముక లాంటిది.

నిర్మొహమాటంగా మాట్లాడుకుందాం. 'అమన్ కీ ఆశా' (శాంతి కోసం ఆశ) నినాదం ప్రస్తుతానికి అటకెక్కుతుంది. కశ్మీర్ లోయలో ఇటీవలి సంవత్సరాల్లో పర్యాటకం అద్భుతంగా పుంజుకుంది. దేశీయ, విదేశీయ పర్యాటకులు కలిసి 2023లో రెండు కోట్లు దాటారు. కశ్మీర్ ప్రజల్లో తిరిగి ఆశలు చిగురించాయి. ఇప్పుడవి చెదిరిపోయాయి. పర్యాటకులు బుకింగ్స్ రద్దు చేసుకుంటున్నారు.

హౌటళ్లు, హౌస్ బోట్లలో ఖాళీ రూములు దర్శనమిస్తున్నాయి. కశ్మీరీల ఆర్థిక నష్టం భారీగా ఉంటుంది. అయితే, కౌంటర్ %-% టెర్రర్ కార్యకలాపాలతో సాధారణ ప్రజల్ని దూరం చేసుకోకూడదు. ఉగ్రవాదంపై పోరాటానికీ, వర్గాలను తూలనాడటానికీ మధ్య ఉండే రేఖను దాటకూడదు. కశ్మీరీలు విదేశీ ప్రేరేపిత ఉగ్రవాదం, రాజకీయ అనిశ్చితి... ఈ రెండింటి బాధితులు.


కశ్మీర్లో నాయకత్వం అలంకారప్రాయంగా కాకుండా క్రియాశీలం కావాలి. జాతీయ భద్రత బాధ్య తను ఎవరికైతే అప్పగించారో వారు ఫలితాలు చూపెట్టాలి. లేదా వైదొలిగి సమర్థులకు అవకాశం ఇవ్వాలి. ఈ వేసవి తీవ్రత కశ్మీర్లో ఎక్కువగానే ఉంటుంది. కర్ఫ్యూలు, సోదాలు, ఉద్రిక్తతలు పునరావృతం కావచ్చు. స్థానికుల పట్టువిడుపులకు, భారత ప్రభుత్వ రాజనీతికి ఇది పరీక్ష లాంటిది.

ఒకవంక దేశ సరిహద్దులో శత్రువుతో పోరాడుతూ, మరోవంక దేశం లోపల భారతీయత భావనను పరిరక్షించు కోవాలి. ఇండియా అంతర్గత శాంతిని ఎవరూ తుపాకీతో శాసించలేరని రుజువు చేసుకోవడానికి మనం సుదీర్ఘ ప్రయాణమే చేయాలి.

# ఇరువురి అజెండా ఒకటవ్వాలి!

వామపక్ష తీవ్రవాదమైన నక్సలిజాన్ని 2026 మార్చి నాటికి సమూలంగా అంతం చెయ్యాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా హెూం మంత్రి అమిత్ షా ప్రకటించి, ఆ లక్ష్యం నెర వేరేలాగా పోలీసు యంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. సాధార ణంగా బీజేపీ ప్రతిపాదిత విధా నాలను వ్యతిరేకించడమే విధానంగా ఉన్న ప్రతిపక్ష పార్టీలు నక్సలిజంపై యుద్ధం విషయంలో మాత్రం అమిత్ షా కి అనుకూలంగా ఉన్నాయి. జార?ండ్ సీఎం హేమంత్ సోరేన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం పినరయి విజయన్లు కూడా మావోయిస్టుల ఏరివేతలో తాము భాగస్వాములేనని ప్రకటించారు. దాదాపుగా జాతీయ ఏకాభిప్రాయంతో మావోయిస్టుల ఏరివేత జరుగుతున్నదనేది వాస్తవం. వేల సంఖ్యలో ఉన్న పారామిలిటరీ బలగాలను ఎదుర్కోవటం మావో యిస్టులకు కుదరడం లేదు. ఈ స్థితిలో మావోయిస్టులు తెల్ల జెండా ఎత్తి లొంగిపోకుండా మేము చర్చలకు సిద్ధం అని ప్రకటించారు.

అయితే ఈ చర్చల ప్రకటన కొత్తదేమీ కాదు. నక్స లిజం పుట్టిన తర్వాత చర్చల



ప్రస్తావన ఒకసారి కన్నా ఎక్కువ సార్లే వచ్చింది. 2004లో ఆంధ్ర ప్రదేశ్లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం చర్చలు జరిపినా అవి విఫల మయ్యాయి. ముందుగా ఆయుధాలు, అడవులను వదిలి బయటకు రావాలని ప్రభుత్వం చర్చలకు నిబంధన పెడితే... రక్షణ బలగాలను ముందుగా ఉపసంహ రించుకోండి అంటున్నారు మావోయిస్టులు. చుట్టు ముట్టిన ప్రతిసారీ చర్చల ప్రతిపాదన పెట్టి కొత్త స్థావరాలను సృష్టించుకున్నారు మావోయిస్టులు అనేది ప్రభుత్వ వర్గాల వాదన. చర్చల పేరుతో బయటకు రప్పించి తమ ఆనవాళ్ళను తెలుసుకుని దాడులు పెంచుతున్నారనేది మావోయిస్టుల ఆరోపణ.

4




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శనివారం 26 ఏప్రిల్ 2025

# ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ





**సఖినేటిపల్లి, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సఖినేటిపల్లి, రామేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రముల వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవం లో భాగంగా మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ నిర్వాహించారు. ప్రజలు దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జనావాసాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని డా. సి.హెచ్. దుర్గా కావ్య వైద్యాధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.వి.ఎస్.మూర్తి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, పి. ఎల్. ఎన్. స్వామి, డి లలిత కుమారి, కె.శ్రీనివాస్, ఎ. సరస్వతి హెల్త్ సూపర్ వైజర్స్, ఏ. ఎన్. ఎం లు, హెల్త్ అసిస్టెంట్స్, పి.హెచ్.సి.సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో
# 25 శాతం సీట్లు కేటాయింపు

**సఖినేటిపల్లి, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పేదవిద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి - 1 డి. కిషోర్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేదవిద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించేందుకు విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం వచ్చే విద్యాసంవత్సరంలో ఒకటవ తరగతిలో అర్హులైన చిన్నారులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు విడుదలైన నోటిఫికేషన్ అర్హులైన పేదవిద్యార్థులకు చక్కని అవకాశమని ఎంఈవో డి. కిషోర్ కుమార్ తెలిపారు. ప్రైవేట్, పాఠశాలల్లో ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలుతున్న పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించాలన్నారు. ప్రైవేట్, పాఠశాలలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నెల 28 నుంచి మే 15వరకు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.దరఖాస్తు చేసుకునే సమయంలో వారి నివాసానికి ఒక కిలోమీటరు పరిధిలోని వివిధ పాఠశాలలను ఎంపిక చేసుకునే వీలుందన్నారు. ఒక కిలోమీటరు పరిధిలో వారు కోరుకున్న పాఠశాలలు లేకుంటే మూడు కిలోమీటర్ల పరిధిలో ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రతికూలత గ్రూపులైన అనాథలు, హెచ్ఐవీ ఎఫెక్టెడ్,దివ్యాంగుల వారికి 5శాతం,ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీలు, మైనార్టీలు, ఇతరులకు 6శాతం సీట్లు కేటాయిస్తారన్నారు.అర్హులైన వారికి దరఖాస్తు విషయంలో గ్రామ సచివాలయాల్లోను,నెట్ సెంటర్ లోనూ,మండల విద్యాశాఖ కార్యాలయాల్లో దీనికి సంబంధించి హెల్ప్ డెస్క్ ఉందని మరిన్ని వివరాలకు మా ఆఫీసు సిబ్బంది 99487 36606 %ః 98669 94771 నెంబర్ ను సంప్రదించాలని ఎంఈవో డి.కిషోర్ కుమార్ తెలిపారు.

# పహల్గాం దాడులపై జర్నలిస్టుల నిరసన.
## -రావులపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ.




**రావులపాలెం ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన హత్యాకాండను ఖండిస్తూ.. అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆశిస్తూ కొత్తపేట నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, స్థానికులతో కలిసి గురువారం సాయంత్రం రావులపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక కళా వెంకట్రావు సెంటర్ నుంచి జాతీయ రహదారి, రింగ్ రోడ్డుల మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లో మినీ స్విట్జర్లాండ్ గా పేరుగాంచిన పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన హత్యాకాండతో భయానక వాతావరణం నెలకొందని, ఈ దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను ఏరివేయాలని కోరారు. భారతదేశానికి తలమానికంగా నిలిచే కాశ్మీర్ లో రక్తపాతం సృష్టించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. మళ్ళీ భారతదేశం వైపు చూడకుండా తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఇటీవల పెళ్ళయిన జంటలో భార్య ముందే భర్తను చంపేసిన ఘటనతో దేశ ప్రజలందరిని కలచివేసిందన్నారు. ఇంతటి హృదయ విదారక ఘటన నుంచి భారతీయులు తేరుకుని ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి భరోసా ఇవ్వాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఘనంగా ద రేసింగ్ ఒలివేస్ స్కూల్ యాన్యువల్ డే

**మలికిపురం ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామంలో గత రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలో అడుగుపెట్టిన "ధ రేసింగ్ ఒలివేస్ స్కూల్" ఎన్యువల్ డే ఘనంగా నిర్వహించారు.స్కూల్ చైర్మన్ సందెపూడి ఆదామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ స్కూల్ గత రెండు సంవత్సరాలుగా పిల్లలు మంచి మార్కులతో ఉత్తీర్ణతై కంప్యూటర్ విద్య ఉన్నతమైన ప్రమాణాళికలు కలిగిన ఉపాధ్యాయులచే చక్కటి బోధన సుమారు 500 మంది పిల్లలకి చక్కటి విశాలమైన తరగతి గదులు విద్యను నేర్పిస్తున్న కేరళ ఉపాధ్యాయులు,నైపుణ్యత కలిగి శిక్షణ ఆటలు పోటీలు నిర్వహిస్తూ జరుగుతున్న స్కూల్ కార్యక్రమాల గురించి శంకరగుప్తం గ్రామ సర్పంచ్ రాపాక ఆనందకుమార్ మాట్లాడుతూ ఈ స్కూల్ పిల్లల భవిష్యత్తు కు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి ఎంతో ఉపయోగ పడుతుందని ఇక్కడ మంచి విద్యను అందిస్తున్నారని తెలియజేశారు.విద్యార్థిని విద్యార్థులు చక్కటి ప్రదర్శన ప్రదర్శించి వారికి బహుమతులు సర్టిఫికెట్లు గ్రాడ్యుయేషన్ నిర్వహించి.బహుమతులు అందజేశారు .ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మానుకొండ ప్రమీల,రోటరీ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్,రోటరీ ఇన్ కమింగ్ ప్రెసిడెంట్ గెడ్డం ఫిలిప్ రాజు,స్కూల్ డైరెక్టర్ మోజేస్ ప్రిన్సిపాల్,నిర్మల,ఏవో,యడ్ల శివాజీ,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ

**మలికిపురం ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మలికిపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడబాల యుగంధర్ చేతుల మీదుగా శుక్రవారం క్లస్టర్ నాలుగు,ఐదు,ఆరు ఇన్చార్జి లు అయినటువంటి కట్టా వెంకటరమణ,రాపాక ఆనంద కుమార్,కోళ్ల జయేంద్ర కృష్ణలు పార్టీ సభ్యత్వ కార్డులు అందుకున్నారు.ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు సమక్షంలో బూత్ కన్వీనర్లకు అందజేశారు.

# ఉగ్రవాదుల దాడిగా నిరసనగా మాజీ మంత్రి గొల్లపల్లి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ




**మలికిపురం ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉగ్రవాద దాడి నిరసనగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన మాజీ మంత్రి,రాజోలు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ గొల్లపల్లి తమ ఉనికి కోసం జమ్మూ కాశ్మీర్లో అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తుద ముట్టించాలని,భారతదేశ ప్రభుత్వం దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, భారత దేశంలో ఉన్న ప్రతి పౌరుడు దాడుల పట్ల స్పందించవలసిన అవసరం ఉన్నదని,ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని వైఎస్ఆర్సిపి రాజోలు నియోజకవర్గ ఇంచార్జ్ గొల్లపల్లి సూర్య రావు అన్నారు.మాజీ ముఖ్యమంత్రి,వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వై ఎస్ జగన్ గారు ఇచ్చిన ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,రాజోలు నియోజకవర్గ ఇంచార్జి గొల్లపల్లి సూర్యారావు నాయకత్వంలో మలికిపురం పార్టీ కార్యాలయం నుండి వేంకటేశ్వరస్వామి గుడివద్ద మెయిన్ రోడ్ వరకు వైఎస్ఆర్సిపి క్యాడర్ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి,ఉగ్రవాదుల చేతిలో అశువులు బాసిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని శాంతి ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షులు,జడ్పీటీసీలు,ఎంపీపీలు,ఎంపీటీసీలు సర్పంచులు,వివిధ విభాగాల అధ్యక్షులు,సోషల్ మీడియా యోధులు,పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామిని దర్శించుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు

**మలికిపురం ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




మలికిపురం ఎత్తు వంతెన వద్ద నూతనంగా నిర్మించి ప్రతిష్టించిన శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి వారి ఆలయానికి కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందం సతీ సమేతంగా విచ్చేసి శ్రీ అయ్యప్ప స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారి దర్శనం చేయించి పట్టు వస్త్రాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు),దెందుకూరి రాంబాబు రాజు,మిరియాల హనుమంతరావు,పేరాబత్తుల దొరబాబు,అన్నంనీడి సుబ్బారావు,వై.ఫణి కృష్ణ, కటికిరెడ్డి మహేష్,అంతర్వేదిపాలెం పుల్లయ్య,వేలూరు నాగ సూర్యనారాయణమూర్తి,మిరియాల ఆదినారాయణ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# వివేకానంద విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత

**మలికిపురం ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




పదవ తరగతి 2025 పరీక్షా ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించారు.ఇటీవల విడుదలైన ఎస్ ఎస్ స ఫలితాలలో మలికిపురం మండలం విశ్వేశ్వరపురంలోని వివేకానంద స్కూల్ విద్యార్థినీ విద్యార్థులైన ఆర్.నేహా శ్రీ 577/600, ఎన్. దీక్షిత 574/600, ఎం.సాహితీ 562/600, పి.బాలాజీ రంకుమార్ 555/600, ఆర్.జోషేప్ 552/600 ,సిహెచ్.మాధవ్ వెంకట శ్రీనివాస్550/600,జి.మనోజ్ పాల్549/600 ,డి.నైషిక 541/600,ఎం.చింటు 514/600 ,మార్కులతో 100% ఉతీర్ణత సాధించారు. పరీక్షకు హాజరైన 20 మందిలో 550 పై బడి6గురు విద్యార్థులు,500 మార్కులు దాటి 10 మంది విద్యార్థులు సాధించారని, ప్రథమ శ్రేణి 18 మంది,ద్వితీయ శ్రేణి లో ఇద్దరు పాఠశాల స్థాయిలో విజయం సాధించారని కరెస్పాండంట్ ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ కరెస్పాండంట్ పి.వి.వి.వర ప్రసాద్ అభినందనలు తెలిపారు.




కాళేశ్వరం - సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



**అమలాపురం, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మే 15 నుండి 26వ తేదీ వరకు జరగనున్న కాళేశ్వరం- సరస్వతీ నదీ పుష్కరాలకు వెళ్ళేందుకు భక్తుల సౌకర్యార్థం ఏపిఎస్ ఆర్టీసీ కోనసీమ జిల్లా లోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్.టీ.పి రాఘవ కుమార్ తెలిపారు. ఈ యాత్ర ప్యాకేజిలో వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాలతో పాటు ముఖ్యంగా సరస్వతి నదిలో పుష్కర స్నానం చేసేటట్లు ఏర్పాటు చేసారని ఆయన తెలిపారు. అమలాపురం డిపో నుండి ఇంద్ర ఏసీ సర్వీసు కూడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులకు ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రిజర్వేషన్ టికట్ కొరకు 9959225576, 9959225550, అసిస్టెంట్ మేనేజర్ 7013868687 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ఛార్జి ఒక్కరికీ రూ.2200, ఇంద్ర ఏ. సి. బస్సు టికెట్ ఛార్జి రూ.2700 అని, బస్సు సామర్థ్యానికి సరిపడా ప్రయాణికులు వస్తే వారి గ్రామం నుండి నేరుగా బస్సును బ్యాచ్ లా పంపిస్తామని అమలాపురం డిపో మేనేజర్ సిహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. కాబట్టి ప్రయాణికులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా కోరారు. ఋ-

# పల్లంలో కుళాయి వద్ద ఘర్షణ, కత్తులతో దాడి,పలువురికి గాయాలు

**కాట్రేనికోన, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కాట్రేనికోన మండలం లోని అత్యంత సమస్యాత్మక మత్స్యకార గ్రామం పల్లంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ఒకరిపై మరొకరు కత్తులతో దాడిచేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. మల్లాడి ధర్మారావు, మల్లాడి వీర్రాజు కుటుంబాల మధ్య కక్షల నేపథ్యంలో ఘర్షణ జరిగిందని, రాజకీయ పార్టీల ప్రమేయం లేదని ఎస్సై అవినాష్ తెలిపారు. గాయపడ్డ క్షతగాత్రులను ముమ్మిడి వరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పలువురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సిఐ మోహన్ కుమార్ పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మలేరియాను నిర్మూలించడం మనందరి బాధ్యత డాక్టర్ రాజకుమార్




**ఐ.పోలవరం, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మలేరియాను నిర్మూలించడం మన అందరి బాధ్యత అని సబ్ యూనిట్ అధికారి డాక్టర్ పి రాజ్ కుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు(%ణవీఉ%) ఆదేశాల మేరకు కేసనకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్ బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.మలేరియా అంతం మనతోనే , దోమ పుట్టరాదు దోమ కుట్టరాదు, దోమల నిర్మూలిద్దాం. దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం, అంటూ నగరపురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, మలేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. దోమల నివారణ జరిగితే మలేరియా అంతమవుతుందని పేర్కొన్నారు. మీరు నిలవన్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం రాజేష్ బాబు, ఎంపిహెచ్ఇఓ %వీ%.వెంకటేశ్వర్లు ,ఎం పి హెచ్ ఎస్ కే .రమేష్ గారు,ఎం సూర్య కుమారిగారు.మరియు ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముమ్మిడివరంలో నల్ల రిబ్బన్లతో ముస్లింల ప్రార్థనలు



**ముమ్మిడివరం, ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా డా.బి.ఆర్.అంభేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నసరుల్ ముమెనీన జామెవుల్ మస్ జిద్, మస్జిద్ జహార లో శుక్రవారం నమాజులకు నల్ల రిబ్బన్లతో ముస్లింల ప్రార్థనలు నిర్వహించారు. మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఎం.ఎ.గౌష్ బాషా ఆధ్వర్యంలో కాశ్మీర్ లో పలువురును కాల్చి చంపిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ముస్లింలు. సర్వ మతాలకు నిలయమైన భారతదేశంలో మతాలమధ్య చిచ్చుపెట్టేలా ఉగ్ర మూకలు మారనకాండ ఇదే చివరిది అవ్వాలని. దాడికి పాల్పడిన ఉగ్రవాదులును పట్టుకుని బహిరంగంగా కాల్చి చంపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులు పట్ల కఠినంగా వ్యవహరించాలని, ముస్లీం సమాజమంతా ప్రభుత్వం వెంట, వెనుకుంటుందని తెలిపారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు.



# ప్రకృతి వైపరీత్యాల ఎదుర్కొనేందుకు సంసిద్ధత ప్రణాళిక సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రానున్న వర్షాకాలంలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేలా సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో రానున్న వర్షాకాలంలో వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన సంసిద్ధత చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాల సమయంలో తూఫాన్, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గోదావరి తీర ప్రాంతంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఆ ప్రదేశాలలో ప్రజలను ఉంచేందుకు తాత్కాలిక షెడ్లు, త్రాగునీరు, టాయిలెట్లు, వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాల కారణంగా కూలిపోయే శిధిలావస్థలో ఉన్న భవనాలు, బ్రిడ్జి లు, కల్వర్టులు, కాజ్ వే లను గుర్తించి, ముందుగానే మరమ్మత్తులు చేయించాలన్నారు. వర్షకాల సమయంలో వాటి కారణంగా ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా ముందుగానే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నదులు, కాల్వలు, చెరువులు గట్లను పరిశీలించి బలహీనం చోట్ల పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వరదల సమయంలో గండ్లు పడిన ప్రదేశాలను పరిశీలించి, అవసరమైన చోట పటిష్టం చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్లు, వరదల సమయంలో విద్యుత్ స్థంబాల కారణంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు ముందస్తుగానే సంసిద్ధత చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకూడదు: వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కలిగించాలి– కలెక్టర్
వేసవిలో జిల్లాలో ఎక్కడ త్రాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కాల్వలు కట్టే లోగా జిల్లాలోని మంచినీటి చెరువులన్నింటిని నింపుకోవాలన్నారు. శివారు ప్రాంతాలకు సైతం నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మత్తులకు గురైన బోర్లను వెంటనే మరమ్మత్తులు చేయించాలని, త్రాగునీటి సమస్య తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు కలుషితం కాకుండా రక్షిత త్రాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి పైపులైన్లు, డ్రైనేజి పైప్ లైన్లు కలవకుండా చూడాలన్నారు. అన్ని గ్రామాలలో త్రాగునీటి నమూనాలు సేకరించి పరీక్షించాలని, కలుషిత నీరు సరఫరా జరిగే ప్రాంతాలలో అందుకు కారణాలు తెలుసుకుని వాటిని నివారించి ప్రజలకు రక్షిత నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుత వేసవిలో ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించాలని వైద్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, జిల్లాపరిషత్ సీఈఓ కె. భీమేశ్వరరావు, డి ఆర్ డిఏ పీడీ కె. విజయరాజు, డిఎంహెచ్ఓ డా. మాలిని, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్, డిపిఓ కె. అనురాధ,ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాథ్ బాబు,ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భాను ప్రతాప్, ఉప రవాణా కమీషనర్ కరీం , ప్రభృతులు పాల్గొన్నారు.

# స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి.ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచన.



ఏలూరు,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్పౌజ్ కేటగిరీ కింద కొత్తగా మంజూరు చేసే పింఛన్లకు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. స్పౌజ్ కేటగిరీ కింద రాష్ట్రంలో కొత్తగా 89,788 మందికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామం అని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే భార్యకు తదుపరి నెల నుంచే పింఛన్ అందించేలా ఈ కేటగిరీని ప్రవేశపెట్టి గత ఏడాది నవంబరు నుంచి అమలు చేస్తూ, లబ్ధిదారులకు రూ.4 వేల చొప్పున పింఛన్ పంపిణీ ఎంపీ పేర్కొన్నారు. అయితే 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య ఉన్న ఇదే కేటగిరీకి చెందిన అర్హులకూ పింఛన్ అందించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ తాజాగా ఆదేశాలిచ్చిందని ఎంపీ తెలిపారు. అర్హురాలైన మహిళలు భర్త మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు తన ఆధార్ కార్డు వివరాలను సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించాలని ఎంపీ సూచించారు. ఏప్రిల్ 25 నుంచి ఈ నెల 30 లోపు వివరాలతో కూడిన దరఖాస్తు సమర్పిస్తే మే 1న పింఛను సొమ్ము పంపిణీ చేస్తారని ఎంపీ తెలిపారు. గడువు లోపు నమోదు చేసుకోలేని వారికి జూన్ 1 నుంచి చెల్లిస్తారని ఎంపీ వెల్లడించారు. పూర్తి వివరాలకు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు.

# వరాహస్వామిక్షేత్రంలో చలివేంద్రం ప్రారంభం మజ్జిగ పంపిణీ చేసిన ధర్మకర్తలు

రాజమహేంద్రవరం ,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు కోరుకొండ రోడ్డులోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం వద్ద ఆలయధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం,కాలెపు నాగేశ్వరరావు చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు.శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళా శాసనాలతో శ్రీవారి క్షేత్రంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ధర్మకర్తలు తెలిపారు. ఈ వేసవి కాలమంతా బాటసారు ల దాహార్తి తీర్చేందుకు నిత్యం ఈచలివేంద్రంలోమజ్జిగ, మంచినీళ్ళు అందుబాటులో ఉంటాయని కాలెపు సూర్య సింహాచలం,కాలెపు నాగేశ్వరరావు తెలిపారు. మండుటెండలో ఈ మార్గంలోపయనించే బాటసారులు,వాహన చోదకులు శ్రీవారి సన్నిధిలో దాహార్తి తీర్చుకుని కాసేపు సేదతీరి వెళ్ళవచ్చని వారు కోరారు.చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు అవసరాల శ్రీ కిరణ్ స్వామి,ఉభయ వేదాంత ఆచార్య పీఠం అధ్యక్షుడు ఇంజినీర్ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో చేరికలపై

# ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు,ఇంటింటి ప్రచారం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



భీమవరం,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలలో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, ప్రభుత్వ పాఠశాలల విద్యాబోధనపై ఇంటింటి ప్రచారం ద్వారా ప్రతి ఒక్క తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ పదో తరగతి పరీక్ష ఫలితాలు, ప్రభుత్వ పాఠశాలలో చేరికలు, అల్పదాయ వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయింపు, బడి బయట పిల్లలు చేరికలు, ఆపార్ ఐడి నమోదు అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్య ఎందుకు మేటిగా నిలుస్తుందో ప్రతి ఒక్కరికి తెలియచెప్పాలన్నారు. కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానంపై ప్రతి ఒక్కరికి తెలియ చెప్పడమే ప్రధానమన్నారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు గొప్ప మేలు తలపెడుతున్నామన్న భావనతో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్చి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాళ్లు ఎంత మేలు చేస్తున్నారో 10వ తరగతితోనే తెలిసిపోతుందన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో అన్ని మౌలిక వసతులతో ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం, దుస్తులు, బ్యాగ్ తదితర వాటితో పాటు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందేనని, దీనికి మీ వంతుగా మరింత ప్రచారం, అవగాహన కలగజేస్తే సరిపోతుందని అన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచే లక్ష్యంగా బడి బయట పిల్లలు ఉండకూడదని మన ముఖ్యమంత్రి దాదాపు 20 సంవత్సరాల క్రితమే సూచించడం జరిగిందని, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి కూడా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారని, వారు మెరుగైన విద్యకు అందిస్తున్న చేయూతతో పాటు మీరు మరింత శ్రద్ధతో బాగా పనిచేసి మంచి ఫలితాలను సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం కొరవడడం జరిగిందన్నారు. గ్రామ, మండల స్థాయిలో ప్రణాళికలను సిద్ధం చేసుకుని మండల ప్రత్యేక అధికారి, ఎంఈఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని సూచించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా 82.15 శాతం నమోదు చేసుకుని రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచిందన్నారు. రానున్న విద్యా సంవత్సరం ఫలితాల్లో ఈ స్థానం మరింత తగ్గాలన్నారు. జిల్లాలో మొత్తం 21,539 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో మగ పిల్లలు 10,924 మందికి గాను 8,612 మంది ఉత్తీర్ణత చెంది 78.84 శాతం, ఆడపిల్లలు 10,615 మందికి గాను 9,083 మంది ఉత్తీర్ణత చెంది 85.57 శాతాన్ని నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు మే 19 నుండి మే 28 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని డీఈఓ ను ఆదేశించారు. అల్పదాయ వర్గాల పిల్లలకు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25% కోటా సీట్లు భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందని, ఏప్రిల్ 28 నుండి మే 15 వరకు నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. 25 శాతం సీట్లు భర్తీ సమయంలో సింగిల్ పేరెంట్ చిల్డ్రన్, తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా ఇంకా 32,723 మంది విద్యార్థులకు ఆపార్ ఐడి జనరేట్ చేయాల్సిందని, దీనిపై ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కొంతమంది పిల్లల తల్లిదండ్రులు ఆధార్ డేటా నమోదు చేసి ఉంటారని, వాళ్ల వద్ద సమాచారం ఉండకపోవచ్చునని, మళ్లీ ఆ పిల్లవాని డేటా నమోదుకు సాధ్యపడదన్నారు. ఇటువంటి కేసులకు సంబంధించిన ఆధార్ లేని పిల్లల వివరాలను సేకరించి మండలాల వారిగా అందజేస్తే హైదరాబాదులోని ఆధార్ రీజనల్ సెంటర్ కు పంపి సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలు బడి బయట ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని, ముఖ్యంగా 6, 7, 8 తరగతులలో డ్రాప్స్ ఔట్స్ ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని నిరోధించడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలన్నారు. సమావేశం అనంతరం "మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం.. బడివైపు ఒక అడుగు" సమాచారంతో కూడిన కరపత్రాన్ని, గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఇఓ ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసి పి. శ్యాంసుందర్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి వై.దోసి రెడ్డి, డిప్యూటీ ఈవోలు, డీఈఓ కార్యాలయం ఏడి ఎన్.సత్యనారాయణ, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల్లో ద్వాత్రింశత్ వార శ్రీసూక్త సహిత అష్టలక్ష్మి హవనం

భీమవరం,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ద్వాత్రింశత్ వార శ్రీసూక్త సహిత అష్టలక్ష్మి హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధ్యక్షులు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో ఏడిద త్రిమూర్తులు, శేషు వరహాలక్ష్మి దంపతులు, నిమ్మల రాంబాబు, భువన దంపతులు, కొండపల్లి మోహన్ కుమార్, ఊహా శ్రీలక్ష్మి దంపతులచే అర్చకులు శ్రీనివాస చార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో ద్వాత్రింశత్ వార శ్రీసూక్త సహిత అష్టలక్ష్మి హవనం నిర్వహించారు. వందలాది మంది మహిళలు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపడకల రామారావు, జానపాటి మధు, పెన్నడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణి కుమార్, అల్లం రమేష్, నళిని మోహన్, మామిడిశెట్టి జయ కుమార్, కట్టా లక్ష్మణ స్వామి, ప్రగాఢ సుబ్బారావు పద్మావతి మహిళా పారాయణం బృందం పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించాలి.

## ఉధ్యాన పంటల విస్తరణపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.



ఏలూరు,ఏప్రిల్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఉధ్యాన, మైక్రోఇరిగేషన్, ఫుడ్ ప్రోసెసింగ్ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఆయిల్ ఫామ్ సాగుపై ఉధ్యానవన, వ్యవసాయ, విస్తరణ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 2,80,814 ఎకరాల్లో ఉధ్యాన పంటలు సాగువుతుండగా అందులో 1,35,656 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగవుతుందన్నారు. ఉధ్యాన పంటల విస్తరణలో భాగంగా 2025–26 ఆర్ధిక సంవత్సరంలో 14 వేల హెక్టార్లో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కు లక్ష్యాన్ని నిర్ధేశించడం జరిగిందన్నారు. ఈ విషయం ఆయా మండలాల వారీగా సంబంధిత ఉధ్యాన శాఖ అధికారులకు, సచివాలయ ఉధ్యాన అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. దానికి అనుగుణంగా లక్ష్యాసాధనకు నెలలోపు మైక్రోప్లానింగ్ రూపొందించుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగు పురోగతిపై వ్యవసాయ, సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణన చేయాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఆసక్తి కనబరిచే రైతులను గుర్తించేందుకు ఆయా రైతు కుటుంబాలను సంప్రదించి పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట వేసిన మొదటి నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం కల్పించే రాయితీలను రైతులకు అవగాహన పర్చాలన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలు సరఫరా, మొక్కలు నాటిన రైతుకు అందించే మొక్కల సరఫరాలో, ఇతర సబ్సిడీలు అందించడంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. పంటకు అవసరమైన డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం చర్యలు చేపట్టాలన్నారు. పొగాకు పంటసాగుకు ప్రత్యమ్నాయంగా ఇతర ఉధ్యాన పంటల సాగుపై రైతులను చైతన్యం పరచాలన్నారు. కొబ్బరిలో కోకో అంతర పంటను ఇతోధికంగా ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ ఫామ్, ఇతర ఉధ్యాన పంటల సాగులో నూతన టెక్నాలజీ, సాగుకు సంబంధించిన అంశాలపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో అవగాహన పరిచి వారి సాగులో వారి అనుమానాలు, సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఇదే సమయంలో కొత్త పంటలను ప్రోత్సహించే సమయంలో సాగులో అవలంబించే నూతన సాంకేతికతను రైతులకు అవగాహన పరచాలన్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరం తోటల మనుగడ, పంటకోత తర్వాత మరియు మార్కెటింగ్ మౌలిక సదుపాయాల పథకాలకు సహాయం, ఉధ్యాన పంటలు జివిఎకు దోహదపడే కీలక పనితీరు, ఆయిల్ ఫామ్ పంటలో అవలంబించాల్సిన లోతైన సాంకేతికతలు, ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ పథకం పురోగతి, మైక్రోఇరిగేషన్ కు సంబంధించిన అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జిల్లాలో ఆహార ప్రోసెసింగ్ రంగంలో సూక్ష్మస్థాయి సంస్థలను ప్రోత్సహించేందుకు తొలి దశలో 100 యూనిట్లు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. వివిధ మండలాల్లో మొక్కజొన్న, జీడిపప్పు ప్రోసెసింగ్, బనాన పౌడర్, వేరుశెనగ నూనె, మినీ ధాల్ మిల్లులు, కోకో బట్టర్ యూనిట్లు, తదితర యూనిట్ల ఏర్పాటుకు వ్యవస్థాపకులు(ఎంటర్ ప్యూనర్స్), కొనుగోలుదారులను గుర్తించాలన్నారు. రిటైల్ ట్రేడింగ్ యూనిట్ల ఏర్పాటుకు చురుకైన స్వయం సహాయ సంఘాలను , ఎఫ్ పివోలను గుర్తించి సమావేశాలు నిర్వహించాలన్నారు. వచ్చే నెల 15వతేదీ లోపు యూనిట్ల వ్యవస్థాపకులను గుర్తించే కార్యక్రమం పూర్చిచేయాలన్నారు. పిఎంఎఫ్ఎంఇ పథకం కింద రుణం పొందేందుకు జూన్ 2వ వారం నాటికి బ్యాంకులకు ధరఖాస్తులు అందించే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జూలై 20 అనంతరం యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ పంటసాగులో డ్రోన్ల వినియోగంపై వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఉధ్యానవన శాఖ డిడి ఎస్. రామ్మోహన్, మైక్రోఇరిగేషన్ పిడి పి. రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుబ్రహమణ్యేశ్వరరావు, ఎల్ డిఎం డి. నీలాద్రి, పశుసంవర్ధక శాఖ జెడి గోవిందరాజులు, ఫుడ్ ప్రోసెసింగ్ సంస్థ జోనల్ మేనేజర్ మారుతి, సాయి శ్రీనివాస్, ఆయిల్ ఫామ్ సంబంధించి గోద్రేజ్, నవభారత్, త్రిఎఫ్ ఆయిల్ ఫామ్ సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతోపాటు ఉధ్యానవనశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పాక్ జాతీయుల వీసా సస్పెన్షన్లు

## సీఎంలతో మాట్లాడిన అమిత్‌షా..!



**దిల్లీ: ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు.**

గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు అవకాశం ఉంది. ఇక పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ పేర్కొంది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది. అదే సమయంలో ఇక్కడ పాక్ జాతీయులు గడువు ముగిసేలోపు దేశం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించింది.

పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది అమాయకుల ప్రాణాలు తీయడంతో భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో పాక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ నిర్ణయించింది. దీంతో సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు.. పాక్ జాతీయులు భారత్‌ను వీడాలని నిర్ణయం తీసుకుంది.

# భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు..!



**దిల్లీ: పహల్గాం దాడితో ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ కృతనిశ్చయంతో ఉంది. ఈ ఘటనకు ప్రతీకారంగా తక్షణమే దౌత్యపరమైన ఒత్తిడి పెంచడంతో పాటు.. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా చేసేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. కానీ, పహల్గాం ఉగ్రవాదులను మాత్రం వదిలిపెట్టకూడదని దేశవ్యాప్తంగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో నేరుగా పాక్‌పై ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై చాలా గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈక్రమంలో భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.**

### అత్యాధునిక ఫైటర్ జెట్లను రంగంలోకి దింపడం..

ప్రస్తుతం వాయుసేనలో ఉన్న అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ 2000లను ఉపయోగించి పాక్‌లోని కీలక సైనిక కార్యాలయాలపై దాడులు చేయడం. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు వీటికి ఉన్నాయి. కాకపోతే ఈ ఆప్షన్‌ను వాడితే అంతర్జాతీయ ఒత్తిడి ఎదుర్కోవడానికి భారత్ సిద్ధంగా ఉండాలి.

### నియంత్రణ రేఖను దాటి..

తాజాగా సిమ్లా ఒప్పందాన్ని పక్కనపెడతామని పాక్ బెదిరించింది. దీనిప్రకారం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. ఈ నేపథ్యంలో భారత్ దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది.

ఇటీవల ఎల్‌వోసీ వద్ద పాక్ జరిపిన ఉల్లంఘనలు భారత్‌కు మంచి కారణాన్ని అందిస్తాయి. ఈక్రమంలో ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు మన దళాలకు సవాలుగా మారవచ్చు. ఆపరేషన్లకు సుదీర్ఘ సమయం పట్టడం, ఇప్పటికే బలమైన పొజిషన్లలో పాక్ దళాలు ఉండటం ప్రతికూలంగా మారవచ్చు.

### పెద్ద లక్ష్యాలపై సర్జికల్ స్ట్రైక్స్..

భారీ టార్గెట్లను గుర్తించి.. సర్జికల్ స్ట్రైక్స్ చేయడం కూడా భారత్ ఎదుట ఉన్న ఆప్షన్. కాకపోతే పాక్ అప్రమత్తంగా ఉండటంతో.. ఈ ఆపరేషన్లు దానిని షాక్‌కు గురిచేయవు. ఈ దాడులు అమలుచేయాలంటే.. రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్, శక్తిమంతమైన దళాలు, కచ్చితమైన ప్లానింగ్ అవసరం.

### శతఘ్నులు.. స్నైపర్లతో విరుచుకుపడటం..

లక్ష్యాల పైకి గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం మరో ఆప్షన్‌గా ఉంది. వీటితోపాటు భారీ మోర్టార్లు కూడా వాడొచ్చు. వీటివల్ల తక్కువ ఉద్రిక్తతలు తలెత్తుతాయి. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టొచ్చు.

# నీట్ పేపర్ లీకేజీ కేసు.. ప్రధాన నిందితుడి అరెస్టు




**దిల్లీ: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్‌- యూజీ ప్రవేశపరీక్ష 2024లో ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడైన సంజీవ్ ముఖియాను ఆర్థిక నేర విభాగం (ఈవోయూ) బృందం అరెస్టు చేసింది. గురువారం రాత్రి అతడిని పట్నాలో అరెస్టు చేశామని ఈవోయూ అధికారి నయ్యర్ హుస్సేన్ ఖాన్ వెల్లడించారు.**

నీట్ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన కుట్రదారుగా సంజీవ్ ముఖియా పేరు వినిపించింది. ఈ వివాదం నేపథ్యంలో అతడు పరారయినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల బిహార్ ప్రభుత్వం సంజీవ్‌పై రూ.3లక్షల నజరానా ప్రకటించింది. ఈక్రమంలోనే అతడు పట్నాలోని ఒక అపార్టుమెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు అతడిని అరెస్టు చేశారు. ముఖియా అరెస్టుతో పేపర్ లీక్‌కు కారుకులైన మరింతమంది వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

బిహార్‌లోని నలందా జిల్లా నాగర్‌సోనా ప్రాంతానికి చెందిన సంజీవ్ తొలుత సాబూర్ అగ్రికల్చర్ కాలేజీలో పని చేసేవాడు. అక్కడ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు రావడంతో 2016లో అతడిపై వేటు వేశారు. ఆ కేసులో కొన్నాళ్ల పాటు జైలు శిక్ష కూడా అనుభవించాడు. అనంతరం నలందా కాలేజీ నూర్‌సరయ్ బ్రాంచ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరాడు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మధ్యవర్తులు, విద్యార్థులు సహా 14 మందిని బిహార్ పోలీసులు అరెస్టు చేసి విచారించగా.. సంజీవ్ ముఖియా పేరు ప్రధానంగా బయటకొచ్చింది. కాగా.. సంజీవ్ కుమారుడు శివ్‌కుమార్‌కూ ఈ వ్యవహారంలో హస్తం ఉన్నట్లు తేలింది. బిహార్ ఉపాధ్యాయ నియామక పరీక్ష పేపర్ లీక్ కేసులో అరెస్టై ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. వీరిద్దరూ 'ముఖియా సాల్వర్ గ్యాంగ్' పేరుతో ఓ ముఠాను ఏర్పాటుచేసినట్లు తెలిసింది.

# సంయమనం పాటించండి..

## భారత్, పాక్‌లకు ఐక్యరాజ్యసమితి సూచన



**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటనను భారత్ సహా ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ పేర్కొన్నారు. ఉగ్రదాడిని యూఎన్ తీవ్రంగా ఖండిస్తోందన్న ఆయన.. ప్రస్తుతం ఇరుదేశాలు సంయమనం పాటించాలని సూచించారు. గురువారం విలేకరుల సమావేశంలో స్టీఫెన్ మాట్లాడుతూ.. 'జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది. పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గుటెర్రస్ ఈ ఆందోళనకర పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. భారత్‌-పాక్ (%×అఁఇఖు – ౖఖుఇఆర్ఖుఅ%) దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇక, ఉగ్రదాడికి స్పందనగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ (%×అఁఇఖు%) నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై విలేకరులు ప్రశ్నించగా.. ఈ ఉద్రిక్తతల వేళ నిబంధనలపై ఇరుదేశాలు

# వక్ఫ్ (సవరణ) చట్టంపై సుప్రీంకోర్టులో కేంద్రం కౌంటర్ అఫిడవిట్



**దిల్లీ: వక్ఫ్ (సవరణ) చట్టం-2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వక్ఫ్ చట్టం సరైందేనని సమర్థించుకుంది. ఈ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది.**

ఈ చట్టంలో చేసిన పలు సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల్ని హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికపై పిటిషన్లు ఉన్నాయని ఆరోపించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఒక చట్టాన్ని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చని తెలిపింది. కాకపోతే, పార్లమెంటరీ ప్యానెల్ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం అనంతరమే వక్ఫ్ చట్టానికి సవరణలు చేసిందని తెలిపింది. గతంలో ఉన్న నిబంధనలతో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం జరిగిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ఈ చట్ట సవరణల్ని సమర్థించుకుంది. 2013 తర్వాత ఆశ్చర్యకరంగా వక్ఫ్ భూమి భారీగా పెరిగిందని పేర్కొంటూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ షేర్షా సి షేక్ మొహిద్దీన్ అఫిడవిట్ దాఖలు చేశారు. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ 72 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ముందు దీనిపై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. అయితే, అప్పటివరకు వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించవద్దని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను మే 5కు వాయిదా వేసిన విషయం తెలిసిందే.

# అమెరికా కోసమే చెత్త పనులన్నీ చేశాం..

## ఉగ్రవాదులకు శిక్షణను అంగీకరించిన పాక్..!



**అమెరికా : తమ గడ్డపై ఉగ్రవాదులే లేరంటూ ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్‌కు గట్టి షాక్ తగిలింది. ఉగ్ర సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ నిజమేనంటూ స్వయంగా ఆ దేశ రక్షణమంత్రే అంగీకరించారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు దాయాది నీచ బుద్ధిని బయటపెట్టాయి. అయితే, అమెరికా కోసమే తాము ఉగ్రవాదులను పెంచి పోషించామంటూ ఆ మంత్రి వ్యాఖ్యానించడం గమనార్హం.**

పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ 'స్కై న్యూస్' మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా "ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాక్ చాలాకాలంగా చేస్తోంది? దీనిపై మీ స్పందన ఏంటి?" అని జర్నలిస్టు ప్రశ్నించారు. దీనికి ఖవాజా బదులిస్తూ.. "అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది" అని అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావించారు. అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని అన్నారు.

మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దుల్లో పాక్ తన బలగాలను పెంచుతున్నట్లు తెలుస్తోంది. అఫ్గానిస్థాన్ సరిహద్దులతో పాటు బలోచిస్థాన్‌లో ఉన్న మిలిటరీ సిబ్బందిని నియంత్రణ రేఖ వద్దకు పంపిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అటు జవాన్ల సెలవులను కూడా పాక్ మిలిటరీ రద్దు చేసినట్లు సమాచారం. కొత్త సెలవులను ఆమోదించొద్దని కార్ప్స్ కమాండర్లను ఆదేశించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి.

పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనక "ది రెసిస్టెన్స్ ఫ్రంట్' హస్తం ఉన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇది పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది.

# రో - కో సూపర్ ఫామ్..
# ఫ్యాన్స్ రీఎంట్రీ అడిగేలా..!

**గతేడాది టీ20 ప్రపంచ కప్‌ను టీమ్ఇండియా కైవసం చేసుకుంది. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్ రోహిత్ శర్మ. ఇక ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన ఆటగాడు విరాట్ కోహ్లీ. అనూహ్యంగా వీరిద్దరూ ఆ వెంటనే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికేశారు. అంతా షాక్.. ఎందుకలాంటి నిర్ణయం తీసుకున్నారనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఐపీఎల్‌లో వారి ఆటతీరు చూశాక.. కాస్త తొందరపడ్డారేమో అనిపిస్తోంది.**



### విరాట్ ఇలా...

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులోకి విరాట్ కోహ్లీ (%ఎఱతీష్ ఖశీష్ట్రశీఱ%) దూసుకొచ్చాడు. ప్రస్తుతం 392 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తొమ్మిది మ్యాచుల్లో 65.33 సగటుతో పరుగులు చేయడం గమనార్హం. గత టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో కోహ్లీ 76 పరుగులు చేశాడు. మిగతా ఏడు మ్యాచుల్లో చేసినవి కేవలం 75 కావడం గమనార్హం. ఆ తర్వాత ఆడిన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరఫున రెండో టాప్ స్కోరర్. అది వన్డే ఫార్మాట్. కుదురుకోవడానికి కాస్త సమయం తీసుకోవచ్చు. కానీ, తీవ్ర పోటీ ఉండే ఐపీఎల్‌లో తొలి బంతి నుంచే బాదుడు మొదలుపెట్టాలి. ఈ విషయంలో కోహ్లీ ఒకేసారి రెండు రకాల పాత్రలను పోషించాడు. వికెట్ పడినప్పుడు లేదా సహచర బ్యాటర్ ఎటాకింగ్‌కు వెళ్లినప్పుడు తాను యాంకర్ పాత్ర పోషించాడు. జట్టుకు అవసరమైన సందర్భంలో దూకుడు ప్రదర్శించాడు. తాజాగా రాజస్థాన్‌పైనా కీలకమైన ఇన్నింగ్స్‌తో కోహ్లీ అదరగొట్టాడు. ఐపీఎల్ (%ఎూ%) 18వ సీజన్‌లో కోహ్లీ తన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఛాంపియన్‌గా నిలపాలనే ఏకైక లక్ష్యంగా ఆడుతున్నట్లు కనిపిస్తోందని మాజీల అభిప్రాయం. ప్రతి మ్యాచ్‌లోనూ గెలుపు కసి అతడిలో కనిపిస్తోంది.

### రోహిత్ అలా..

విరాట్‌తో పోలిస్తే రోహిత్ శర్మ ఆటతీరు పూర్తి భిన్నం. ఇద్దరూ ఓపెనర్లుగా వస్తున్నారు. కానీ, విరాట్ ప్రతి బంతిని స్టాండ్స్‌లోకి పంపిద్దామని భావించడు. రోహిత్ మాత్రం మొదటి బంతి నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడేస్తాడు. అది కొన్నిసార్లు జట్టుకు మంచి చేసినా.. త్వరగా పెవిలియన్‌కు చేరడం వల్ల వ్యక్తిగతంగా ఎలాంటి ఘనతలు అందుకోలేకపోతుంటాడు. ఈసారి ఐపీఎల్‌లో కూడా రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగుతున్నాడు. ఒక మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. తొలి ఆరు మ్యాచుల్లో అతడు చేసిన పరుగులు 82 పరుగులు. ఇందులో ముంబయి గెలిచినవి మూడు. ఎప్పుడైతే వరుసగా రెండు హాఫ్ సెంచరీలు చేశాడో.. అక్కడ్నుంచి ముంబయి ప్లేఆఫ్స్ రేసులో ముందుకొచ్చింది. గత రెండు మ్యాచుల్లోనూ ఆ జట్టు విజయం సాధించింది. రోహిత్ వరుసగా 76, 70 పరుగులు చేసి జట్టును గెలిపించాడు.

### ఆ మాటతో.. ఆశలు

ప్రస్తుతం రోహిత్, విరాట్ ఫామ్‌ను చూస్తుంటే.. అసలు వీరెందుకు టీ20లను వదిలేశారా? అనిపిస్తోంది. అయితే, గత ఏడాది కొన్ని మ్యాచుల్లో వారి ఆటను చూశాక విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఫామ్ తాత్కాలికం.. క్లాస్ శాశ్వతం అనే నానుడి ఇప్పుడు రోహిత్ – కోహ్లీకి సరిగ్గా సరిపోతుంది. రోహిత్ వయసు మరో ఐదు రోజుల్లో 38 ఏళ్లకు చేరుతుంది. కోహ్లీ వయసు ఇంకా 36 ఏళ్లే. గతంలో 40 సంవత్సరాలు వచ్చినా మంచి ఆటతీరు ప్రదర్శించిన క్రికెటర్లను చూశాం. ఇటీవల విరాట్ ఓ మాట అన్నాడు.. ఒలింపిక్స్‌లో టీమ్ఇండియా ఫైనల్‌కు చేరితే తాను ఆడేందుకు సిద్ధంగా ఉంటానన్నాడు. లాస్ ఏంజెలెస్ వేదికగా 2028లో ఒలింపిక్స్ జరుగుతాయి. ఇందులో క్రికెట్‌కు చోటు దక్కిన సంగతి తెలిసిందే. అంటే మరో మూడేళ్లపాటు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ వెళ్తానని పరోక్షంగా చెప్పినట్లైంది. ఇక రోహిత్ విషయంలో స్పష్టత లేదు. హిట్‌మ్యాన్ తన రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకోవడం అసాధ్యమే. ఎన్ని సాధించినా వన్డే ప్రపంచ కప్ గెలిస్తేనే అసలైన మజా వస్తుందని ఇప్పటికే రోహిత్ తన మనసులోని మాట వెల్లడించాడు. అంటే, మరో రెండేళ్ల తర్వాత (2027) జరగబోయే వన్డే కప్ కోసం ఇప్పట్నుంచే రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పుడు వీరిద్దరి ఆటతీరు చూశాక.. వచ్చే ఏడాది పొట్టి కప్ బరిలోకి దిగాలని కోరుకునేవారూ లేకపోలేదు. మరి రో – కో ఏం చేస్తారో చూడాలి మరి..!

# 78వేల సంవత్సరాలైనా మిల్లీమీటర్ భూమిని లాక్కోలేరు
## పాక్‌కు గావస్కర్ చురక



**జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ గట్టి చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పలువురు భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ సంతాపం తెలియజేశారు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వేదికగా జరిగిన ఆర్సీబీ, ఆర్ఆర్ మ్యాచ్ అనంతరం సునీల్ గావస్కర్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్పందించారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదని, భవిష్యత్తులోనూ ఎలాంటి మార్పు ఉండదని పాక్‌కు పరోక్షంగా చురకలంటించారు.**

"ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇది భారతీయులందరిపైనా ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా ఉగ్రవాదులను, వారికి మద్దతుగా నిలిచే వారిని ఒక ప్రశ్న అడుగుదామనుకుంటున్నా. ఇదంతా ఏం సాధించడానికి చేస్తున్నారు? గత 78 ఏళ్లలో ఒక్క మిల్లీమీటర్ భూమినైనా కదల్చగలిగిరా? వచ్చే 78 వేల సంవత్సరాల తర్వాతైనా ఎలాంటి మార్పులు ఉండవు. మరి ఎందుకు ప్రశాంతంగా జీవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మనం మరింత దృఢంగా ముందుకు సాగాలనేదే నా విజ్ఞాపన" అని గావస్కర్ వెల్లడించారు.

# పాస్‌లను అమ్ముకుంటున్నారు



**హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)కు సన్‌రైజర్స్ ఇస్తున్న ఐపీఎల్ కాంప్లిమెంటరీ పాస్‌లను కొన్ని ప్రైవేటు, ఇన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు బ్లాక్‌లో అమ్ముకుంటున్నాయని హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి శేష్‌నారాయణ ఆరోపించాడు. ఎఫ్7 నుంచి ఎఫ్16 వరకు ఉన్న కార్పొరేట్ బాక్సుల్ని హెచ్‌సీఏలోని కీలక వ్యక్తులు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించాడు. ఈమేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి శేష్‌నారాయణ బహిరంగ లేఖ ద్వారా ఫిర్యాదు చేశాడు. సన్‌రైజర్స్‌కు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాంప్లిమెంటరీ పాస్‌లు, సన్‌రైజర్స్‌తో సంబంధాలు, హెచ్‌సీఏ పరిపాలన వ్యవహారాలపై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.**

"సన్‌రైజర్స్ ఆరోపణలు నిర్ధరించుకోవడానికి హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యుల గత 4 వారాల కాల్ డేటాను పరిశీలించాలి. ఎఫ్7 నుంచి ఎఫ్16 వరకు గల కార్పొరేట్ బాక్సుల్ని హెచ్‌సీఏ పెద్దలు పక్కదారి పట్టిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ టికెట్లు హెచ్‌సీఏ వాటాదారులకు అందాలి. అంతర్జాతీయ ఆటగాళ్లు, ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లు, మాజీ కార్యవర్గ సభ్యులకు ప్రతి మ్యాచ్‌కు రెండేసి పాస్‌లు ఇస్తారు. కానీ హెచ్‌సీఏ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి 400–500 పాస్‌లను సొంతానికి వాడుకుంటున్నారు. హైదరాబాద్ క్రికెట్‌కు సేవలందించిన వాళ్లను అవమానిస్తున్నారు. క్లబ్‌ల కార్యదర్శులకు ఒక్క కార్ పాస్ కూడా ఇవ్వట్లేదు. కొన్ని ప్రైవేటు, ఇన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు పాస్‌లను అమ్ముకుంటున్నాయి. కాంప్లిమెంటరీ పాస్‌ల పర్యవేక్షణకు స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలి" అని శేష్‌నారాయణ పేర్కొన్నాడు.

# నా కుటుంబాన్నీ వదలట్లేదు..
## పాక్ అథ్లెట్‌కు ఆహ్వానంపై నీరజ్ చోప్రా ఆవేదన

**పాకిస్థాన్ జావెలిన్ త్రో స్టార్ అర్షద్ నదీమ్‌ను భారత్‌కు ఆహ్వానించడంపై భారత జావెలిన్ హీరో నీరజ్ చోప్రా విమర్శలు ఎదుర్కొంటున్నాడు. పహల్గాం ఘటన నేపథ్యంలో పాక్‌పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో పాక్ అథ్లెట్‌ను ఆహ్వానించాల్సిన అవసరం లేదని పలువురు అభిప్రాయపడ్డారు. మే నెలలో బెంగళూరు వేదికగా ఎన్‌సీ క్లాసిక్ జావెలిన్ ఈవెంట్ జరగనుంది. ఈక్రమంలో తనపై వస్తున్న విమర్శలకు నీరజ్ చోప్రా స్పందించాడు. చోప్రా కూడా ఆర్మీకి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. ఈసందర్భంగా తన కుటుంబం పైనా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశాడు.**

78వేల సంవత్సరాలైనా మిల్లీమీటర్ భూమిని లాక్కోలేరు: పాక్‌కు గావస్కర్ చురక

"సాధారణంగా నేను తక్కువగా మాట్లాడతా. అలాగని తప్పు అని భావించిన వాటికి వ్యతిరేకంగా మాట్లాడను అనే అర్థం కాదు. దేశంపై నా ప్రేమ విషయానికొస్తే ఏమాత్రం వెనకడుగు వేయను. అలాగే నా కుటుంబంపై గౌరవంగా ఉంటా. నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్‌కు అర్షద్ నదీమ్‌ను



ఆహ్వానించడంపై చాలామంది నాపై వ్యాఖ్యలు చేశారు. అందులో చాలావరకు అసభ్యకరమైనవి ఉన్నాయి. వారు నా కుటుంబాన్ని కూడా వదల్లేదు. నేను అథ్లెట్‌గానే అర్షద్‌ను ఆహ్వానించాను తప్పా, ఇందులో మరే ఉద్దేశం లేదు. ఎన్‌సీ క్లాసిక్ లక్ష్యం అత్యుత్తమ అథ్లెట్లను భారత్‌కు తెప్పించడమే. ప్రపంచవ్యాప్త క్రీడా కార్యక్రమాలను నిర్వహించగలమని చెప్పేందుకే. ఇదంతా సోమవారానికి ముందే జరిగింది. పహల్గాంలో ఉగ్రదాడికి ముందే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం. ఆ తర్వాత 48 గంటల్లో చాలా మార్పులు జరిగాయి. అర్షద్ ఎన్‌సీ క్లాసిక్‌కు హాజరుకావడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎప్పుడైనా నా దేశ ప్రయోజనమే నా మొదటి ప్రాధాన్యం. ఈ ఘటనలో నా దేశ ప్రజలను పోగొట్టుకున్నా. వారి కుటుంబాలకు మద్దతుగా నిలుస్తా. పహల్గాం విషయంలో నాకు బాధతోపాటు కోపమూ ఉంది."


"భారత్ గర్వపడేలా ఎన్నోఏళ్లుగా కష్టపడ్డా. అయినా దేశంపై నా చిత్తశుద్ధిని ప్రశ్నించడం బాధగా అనిపించింది. నన్ను, నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసిన వారికి సమాధానం ఇచ్చేందుకే ఈ వివరణ ఇస్తున్నా. మనమంతా సాధారణ ప్రజలం. అనవసరమైన అపోహలను సృష్టించొద్దు. కొన్ని మీడియాల్లోను తప్పుడు కథనాలు ప్రసారం చేశారు. నేను దీని గురించి మాట్లాడలేదు కాబట్టే క్రియేట్ చేసినట్లు ఉన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఎలా మార్చుకుంటారో కూడా అర్థం కావడంలేదు. గతంలో నా తల్లి అమాయకంగా అన్న మాటలను ప్రశంసించారు. ఇప్పుడు అదే పబ్లిక్ నన్ను టార్గెట్ చేయడం బాధాకరం. ఎక్కడికి వెళ్లినా భారత్‌ను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని కష్టపడతా. సరైన కారణాలతో విమర్శలు చేస్తే గౌరవంగా ఉంటుంది. జై హింద్" అని నీరజ్ సుదీర్ఘమైన పోస్టును పెట్టాడు.

# అందుకు అంగీకరించినట్లే: పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలపై డానిష్ కనేరియా ఫైర్

**జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విమర్శలకు దారితీశాయి. ఉగ్రవాదులను 'స్వాతంత్ర్య సమరయోధులు' అంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారు. దీనిపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పటికే పాక్ ప్రధాని మౌనంగా ఉండటంపై ప్రశ్నల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.**

78వేల సంవత్సరాలైనా మిల్లీమీటర్ భూమిని లాక్కోలేరు: పాక్‌కు గావస్కర్ చురక

"పాకిస్థాన్ ఉప ప్రధాని (%ఱఝఱ ఐవజూబ్ఎ్రావీ%) ఉగ్రవాదులను ఫ్రీడమ్ ఫైటర్స్ అంటూ సంబోధించారు. ఇది అవమానకరమే కాకుండా..



ఉగ్రవాదానికి మేం మద్దతిస్తున్నాం, ప్రోత్సహిస్తున్నామంటూ బహిరంగంగా అంగీకరించినట్లు అయింది" అని డానిష్ పోస్టు పెట్టాడు. ఇప్పటికే పాకిస్థాన్ ఉగ్రవాదులను కాపాడటంతోపాటు ఆశ్రయం కల్పించడంపై డానిష్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూనే ఉన్నాడు. తాను పాక్ లేదా ఇక్కడి ప్రజలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టంచేశాడు.

### మీ వల్లే దేశమంతా బాధపడుతోంది

"నేను ఇక్కడ పాకిస్థాన్ లేదా దేశ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. ఉగ్రవాదం చేతిలో పాక్ తీవ్రంగా బాధపడుతోంది. శాంతి కోసం నిలబడే నాయకత్వం అవసరం ఉంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారు కాదు. నేను గర్వంగా పాక్ క్రికెట్ జెర్సీని ధరించా. మైదానంలో నా చెమటను చిందించా. చివరికి నన్ను ట్రీట్ చేసిన విధానం కూడా పహల్గాం బాధితులకు భిన్నంగా లేదు. హిందువుగా ఉన్నందుకే లక్ష్యంగా మారా. ఉగ్రవాదాన్ని సమర్థించేవారు సిగ్గుపడాలి. హంతకులను రక్షించేవారు సిగ్గుపడాలి. నేనెప్పుడైనా మానవత్వం, వాస్తవం వైపే నిలబడతా. పాకిస్థాన్ ప్రజలు కూడా ఇలానే ఉంటారని భావిస్తున్నా. వారిని తప్పుదోవ పట్టించొద్దు" అని సుదీర్ఘమైన పోస్టు పెట్టాడు.

జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ స్పందించకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా విమర్శలు గుప్పించాడు. ప్రధాని షరీఫ్‌కు వాస్తవం తెలుసంటూ వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నట్లు పేర్కొన్నాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక


# సమంత పోస్ట్ పై నోరుపారేసుకున్న నెటిజన్



టాలీవుడ్ హీరోయిన్ సమంత ఏం చేసినా సరే దాని చుట్టూ ఏదో ఒక రచ్చ జరుగుతూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆమె సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు, చేసే కామెంట్లు హాట్ టాపిక్‌గా మారుతుంటాయి. అయితే కొన్నిసార్లు ఆమె ఏదో అనుకుని పోస్టులు పెడితే నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకుని చివాట్లు పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాగే ఇన్‌స్టాలో ఆమె పెట్టిన పోస్టు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఇంతకు సమంత ఇన్‌స్టా లో ఏం పోస్ట్ పెట్టిందంటే, 'నదులు తమ నీటిని తాము తాగవు. చెట్లు తమ పండ్లను తినవు. సూర్యుడు తన కోసం ప్రకాశించడు. పువ్వులు తమ సువాసనను తాము పీల్చుకోవు. ఇతరుల కోసం జీవించడమే ప్రకృతి నియమం. మనమందరం ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి పుట్టాం. ఎంత కష్టమైనా సరే సంతోషంగా ఉన్నప్పుడే జీవితం బాగుంటుందిబీ కానీ మీ వల్ల ఇతరులు సంతోషంగా ఉంటే ఇంకా మంచిది' అని పోప్ ఫ్రాన్సిస్ చెప్పారంటూ సమంత ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది.

సమంత పోస్ట్‌ని స్క్రీన్ షాట్ తీసిన పెద్ది రెడ్డి అనే ఓ నెటిజన్, దాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఆమెపై నోరుపారేసుకున్నాడు. 'విడాకులు తీసుకుంది, రోగం వచ్చింది అని సమంత మీద కాస్త సాఫ్ట్ కార్నర్ ఉండేది. సాయం చేయడానికి వాళ్లేమైనా మనుషులు అనుకున్నావా తీవ్రవాదులు. నీకు అంత హెల్పింగ్ నేచర్ ఉంటే పాకిస్థాన్‌కి వెళ్లి చేసిరా, అంతేగాని ఇక్కడ మాట్లాడకు' అంటూ తీవ్ర పదజాలంతో రెచ్చిపోయాడు. ఈ ట్వీట్ ఆధారంగా చాలామంది నెటిజన్లు సమంతని ట్రోల్ చేస్తుండగా మరికొంతమంది ఆమెకి సపోర్ట్ చేస్తున్నారు. ఇటీవల చనిపోయిన పోప్ ఫ్రాన్సిస్‌కి నివాళిగా సమంత పోస్ట్ చేస్తే దాన్ని ఎందుకు కాంట్రవర్సీ చేస్తున్నారని కొందరు నిలదీస్తున్నారు. దీనికి కొందరు కౌంటర్ ఇస్తూ పోప్ ఏప్రిల్ 21న చనిపోతే మరుసటిరోజు అంటే ఏప్రిల్ 22న కశ్మీర్‌లో ఉగ్రదాడి జరిగిన రోజే సమంత ఎందుకు పోస్ట్ పెట్టిందని నిలదీస్తున్నారు. సమంత క్యారెక్టర్ ఎలాంటిదో తెలిసే నాగచైతన్య, నాగార్జున ఆమెని వదిలించుకున్నారని పర్సనల్ లైఫ్ గురించి కామెంట్లు చేస్తున్నారు. నిజంగానే పోప్ కోసం ఆ పోస్ట్ పెట్టి ఉంటే మరెందుకు డిలీట్ చేసిందని ప్రశ్నిస్తున్నారు.

# రష్మిక మందన్న కొత్త ప్రేమ

**నేషనల్ క్రష్ రష్మిక మందన్న పాన్ ఇండియా రేంజ్‌లో వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది.**



నేషనల్ క్రష్ రష్మిక మందన్న పాన్ ఇండియా రేంజ్‌లో వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో సూపర్ హిట్స్‌ను సొంతం చేసుకున్న రష్మిక ఇటీవల వచ్చిన సికిందర్ సినిమాతో నిరాశ పరచింది. సల్మాన్ ఖాన్ నటించిన ఆ సినిమాపై మొదటి నుంచి కూడా అంచనాలు లేవంటూ కొందరు కామెంట్ చేస్తే, ఆ సినిమా ఫ్లాప్ రష్మిక మందన్న కెరీర్ పై ఏమాత్రం ఎఫెక్ట్ చేయదని కొందరు అంటున్నారు. మొత్తానికి రష్మిక మందన్న జోరుకు సికిందర్ బ్రేక్‌లు వేసిందనే వార్తలను ఆమె ఫ్యాన్స్ ఖండిస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో మరోసారి రష్మిక తన సత్తా చాటడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్‌గా రష్మిక మందన్న ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. ఎక్కువ శాతం స్కిన్ షో ఫోటోలను ఈమె షేర్ చేస్తూ ఉంటుంది. కానీ ఈసారి మాత్రం క్యూట్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రష్మిక మందన్న చేతిలో పూలు పట్టుకుని, తలపై పూలు పెట్టుకుని భలే ముద్దుగా ఉన్నారు అనే విధంగా ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా సెలబ్రెటీలు తలలో పూలు పెట్టుకునేందుకు ఆసక్తి చూపించరు. ఏదైనా సినిమా షూటింగ్ సమయంలో పూలు పెట్టుకుంటారేమో తప్ప ప్రత్యేకంగా హాజరు అయిన కార్యక్రమాలకు పూలు పెట్టుకుని కనిపించడం, ఫోటో షూట్స్ కోసం పూలు పెట్టుకోవడం జరగదు. రష్మిక మందన్న తాజాగా పూల గురించి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పందించింది. మీరు చివరి సారి ఎప్పుడు పూలను కొనుగోలు చేశారు, నిన్ను నువ్వు తరచుగా అభినందించుకోవడానికి మరియు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి ఒక సున్నితమైన జ్ఞాపకం పూలు.. ఎందుకంటే ప్రపంచంలోని ప్రేమ మరియు దయ అంతా పూలకు అర్థం అంటూ పూలపై తన ప్రేమను కనబర్చింది. రష్మిక కొత్తగా పూలపై తన ప్రేమను కనబర్చడం విడ్డూరంగా ఉందంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉంటే, స్వచ్ఛమైన ఆడవారికి పూలు అంటే చాలా ఇష్టం ఉంటుంది. అంతే కాకుండా అమ్మాయిలు అబ్బాయిల కంటే ఎక్కువగా పూలను ఇష్టపడుతారు అంటారు. రష్మిక కి సైతం పూలపై ప్రత్యేక ప్రేమ ఉందని దీంతో అర్థం చేసుకోవచ్చు. సికిందర్ సినిమా తర్వాత ఈ అమ్మడు కాస్త గ్యాప్ తీసుకుని ది గర్ల్ ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రష్మిక ఓకే చెప్పాలే కానీ ఏడాదిలో నాలుగు అయిదు సినిమాలు ఆమె నుంచి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ రష్మిక మాత్రం చాలా కండీషన్స్ పెడుతూ సినిమాలకు కమిట్ అవుతుంది. కనుక కాస్త తక్కువ సినిమాలు వచ్చినప్పటికీ క్వాలిటీ సినిమాలు వస్తున్నాయని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈమె హిందీలో ప్రస్తుతం రెండు పెద్ద సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతోంది. మరో వైపు యానిమల్ పార్క్‌లోనూ ఈమె నటించే అవకాశాలు ఉన్నాయి.

# సత్య సినిమా నాకు గుర్తింపును తెచ్చిపెట్టింది : మనోజ్ బాజ్‌పేయ్

బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు మనోజ్ బాజ్‌పేయ్. సత్య, 'ది ఫ్యామిలీ మ్యాన్', గ్యాంగ్స్ ఆఫ్ వాసిపూర్ చిత్రాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు.అయితే ఇటీవల ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ప్రయాణం టురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు బాజ్‌పేయ్. తన కెరీర్‌లో సత్య ఒక మైలురాయిగా నిలిచిబోతుందని చెప్పాడు.బండిట్ క్వీన్ సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. శేఖర్ కపూర్ లాంటి దిగ్గజ దర్శకుడు తీసిన చిత్రంతో గుర్తింపు వస్తుందనుకున్నాను కానీ అలా జరుగలేదు. అయితే బండిట్ క్వీన్ చూసి వర్మ నన్ను సత్య సినిమాకి ఎంపిక చేసుకున్నాడు. మొదట హీరోగా అనుకున్నాను కానీ హీరో స్నేహితుడి పాత్రలో అని దిగులు చెందాను. సినిమా విడుదలైన తర్వాత హీరో కంటే హీరో స్నేహితుడి పాత్రకే ఎక్కువ ప్రశంసలు దక్కాయి. నాకు నిజంగా గుర్తింపును తెచ్చిపెట్టింది మాత్రం 'సత్య' సినిమానే. ఆ చిత్రంలో నన్ను నమ్మిన రామ్ గోపాల్ వర్మ గారికి ఎంత కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. ప్రతిరోజూ ఆయనను తలుచుకుంటాను. ఆయనతో కలిసి నేను వరుసగా నాలుగు ప్రాజెక్ట్‌లలో పనిచేశాను. మూడు సినిమాల్లో నటించాను, ఒక చిత్రానికి నిర్మాతగా వ్యవహరించాను. నా సినీ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపంటూ మనోజ్ వెల్లడించారు.సినీ పరిశ్రమలో తాను పడ్డ కష్టాల గురించి చెబుతూ 30 ఏండ్ల సినీ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు చూశాను. ఈ చిత్ర పరిశ్రమలో నిలబడటం అంత సులభమైన విషయం కాదు. ఇక్కడ చాలా పోటీ ఉంటుంది. మన ఎదుగుదలను చూసి తొక్కేవాళ్లు ఉంటారు. అలాంటి పరిస్థితులను తట్టుకుని నిలబడి ఈ స్థాయికి చేరుకున్నానంటూ మనోజ్ చెప్పుకోచ్చాడు. తెలుగు పరిశ్రమలోనే కాదు, హిందీ సినీ పరిశ్రమలో కూడా తన సత్తా ఏంటో చూపించాడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఆల్ టైం క్లాసిక్ చిత్రాలలో సత్య ఒకటి.ఈ సినిమాలో జేడీ చక్రవర్తి, మనోజ్ బాజ్‌పాయ్ కథానాయకులుగా నటించగా ఊర్మిళ మతోండ్కర్, షెఫాలీ షా హీరోయిన్‌లుగా నటించారు. ముంబై మాఫియా గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 1998లో జులై 3న విడుదలై సంచలన విజయం అందుకుంది. అప్పటివరకు మూసధోరణి కథలతో నెట్టుకోస్తున్న బాలీవుడ్‌కి అసలైన సినిమాను పరిచయం చేసింది. అంతేకాకుండా ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను సొంతం చేసుకుని సత్తా చాటింది. ఉత్తమ సహాయ నటుడిగా మనోజ్ బాజ్‌పాయ్ జాతీయ అవార్డును గెలుచుకున్నారు. %ముంబైని అండర్ వరల్డ్ రూల్ చేస్తున్న సమయంలో బ్రతుకుదెరువు కోసం అక్కడికి అనాథగా వస్తాడు సత్య (జేడీ చక్రవర్తి). అయితే ఒక హెూటల్‌లో పనిచేస్తున్న సత్యకి లోకల్ డాన్‌తో గొడవ జరగడంతో అతడు సత్యని జైలుకి పంపిస్తాడు. జైలులో ఉన్న సత్యకి అండర్ వరల్డ్ డాన్ భీకూ మాత్రే(మనోజ్ బాజ్ పేయ్)తో గొడవ జరుగుతుంది. అయితే సత్య ధైర్యాన్ని చూసిన భీకూ మాత్రే అతడితో స్నేహం చేయాలని చేతులు కలుపుతాడు. ఈ క్రమంలోనే ఇద్దరు జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం ముంబాయి మహా నగరాన్ని ఎలా శాసించారు అనేది ఈ చిత్రం కథ.





# కృతి షెట్టి.. డెనిమ్ స్కర్ట్ లో హీటెక్కించేచేసిందిగా..

టాలెంట్ తో పాటు గ్లామర్, స్టైల్ పరంగా కూడా కృతి షెట్టి ఎప్పుడూ ఫ్రంట్‌లోనే ఉంటుంది. 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు తన లేటెస్ట్ లుక్‌తో మరోసారి సోషల్ మీడియాలో ఫుల్ అటెన్షన్ దక్కించుకుంది. ఓ బ్రాండెడ్ హూడీ, షార్ట్ డెనిమ్ స్కర్ట్, స్టయిలిష్ యెల్లో షూస్ లో కృతి ఇచ్చిన స్టన్నింగ్ పోస్టులు ట్రెండింగ్‌లోకి వచ్చాయి. ఇన్‌డోర్ లో సాఫ్ట్ లైట్ ఎఫెక్ట్ తో తీసిన ఈ ఫోటోలు.. కృతి ఫ్యాషన్ సెన్స్ ఎంత మోర్డన్‌గా మారిందో చూపిస్తున్నాయి. ఆమె వేసుకున్న క్రీమ్ కలర్ హూడీపై ఉన్న డిజైన్, హెయిర్ స్టైల్, అలాగే జీన్స్ షార్ట్‌పై వేసుకున్న పోజ్ లు ఫ్యాన్స్ కి కొత్తగా అనిపించాయి. ముఖ్యంగా మినిమల్ మేకప్ లోనూ ఆమె ఫేస్ గ్లో, ఎక్స్‌ప్రెషన్స్ అసలు మిస్ కాలేదని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. కృతి ఈ ఫోటోషూట్ ద్వారా ప్రముఖ బ్రాండ్ కి ప్రమోట్ చేస్తోంది. ఇది కృతి కెరీర్ లో బ్రాండింగ్ పరంగా మరో ముందడుగుగా భావించవచ్చు. ఇక ఉప్పెన అనంతరం అమ్మడు అవకాశాలు బాగానే అందుకున్నా హిట్స్ అయితే పెద్దగా రాలేదు. ఇక సక్సెస్ లేకున్నా ఫ్యాషన్ రంగంలో కూడా బ్రాండ్ అంబాసిడర్‌గా అడుగులు వేస్తోంది. ఇటీవల కృతి తక్కువ సినిమాలు చేస్తోందన్న కామెంట్లు వచ్చినా.. ఆమె ఫోటోషూట్లు మాత్రం నిత్యం హైలైట్ అవుతున్నాయి. ఈ లేటెస్ట్ లుక్ చూసినవాళ్లంతా.. "ఫ్యాషన్ కి న్యూ డెఫినిషన్ ఇచ్చింది కృతి షెట్టి" అంటూ కామెంట్లు పెడుతున్నారు. అంతే కాదు, "ఈ యంగ్ హీరోయిన్‌ను త్వరలో మల్టీలాంగ్వేజ్ ప్రాజెక్ట్స్‌లో చూసే అవకాశాలు ఉన్నాయంటూ" టాక్ వినిపిస్తోంది. కృతి ఫోటోలు నెటిజన్లను ఎంతగా ఆకట్టుకున్నాయో ఆమె పెట్టిన క్యాప్షన్ కూడా అంతే ఆకర్షణీయంగా ఉంది "మీరు ఆకర్షించాలనుకునే శక్తిగా ఉండండి.". మొత్తానికి స్పోర్టీ లుక్‌లో కృతి షెట్టి.. మరోసారి ట్రెండింగ్ స్టైల్ ఐకాన్‌గా ముద్ర వేసిందనడంలో సందేహమే లేదు. మరి అమ్మడికి రానున్న రోజుల్లో ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.

# మరోసారి సూర్యాతో నటించనున్న కీర్తి సురేష్



కీర్తి సురేష్ మహానటిమూవీలో సావిత్రిగా నటించి అందరి మన్ననలు అందుకుంది. ఇక కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. అప్పట్లో కీర్తి సురేష్‌ని వరుస హిట్స్ పలకరించిన ఇప్పుడు మాత్రం హిట్ దొరకడం కష్టంగా మారింది. గత కొంత కాలంగా టాలీవుడ్‌లో కూడా అవకాశాలు దక్కించుకోలేకపోతుంది. టాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ కీర్తి సురేష్ కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం పలు సినిమాలో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది.మొదట్లో పద్ధతిగా ఉన్న కీర్తి సురేష్ ఇటీవల గ్లామర్ డోస్ కూడా పెంచింది. పెళ్లయిన తర్వాత గ్లామర్ షోలకు దూరంగా ఉంటుందని అంతా అనుకున్నారు దీనికి భిన్నంగా ముందుకంటే మరింతగా గ్లామర్ షోలు చేస్తూ రెచ్చిపోతుంది. గత సంవత్సరం అట్లీ నిర్మాణంలో విడుదలైన బేబీ జాన్ చిత్రం ద్వారా హిందీలోకి అడుగుపెట్టింది కీర్తి సురేష్. ఆ చిత్రంతో కీర్తి బాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంది. కాని మూవీ పరాజయం చెందడంతో తిరిగి దక్షిణాది సినిమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారట. రీసెంట్ గా కీర్తి సురేష్ మరో జాక్‌పాట్ కొట్టినట్టు తెలుస్తోందిలక్కీ బాస్కర్,సార్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించనున్నారట. సూర్యా 46వ సినిమాగా ఈ చిత్రం రూపొందుతుండగా, ప్రస్తుతం ఈసినిమాకు సబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. 7 ఏళ్ల క్రితం సూర్య, కీర్తి సురేష్ కాంబినేషన్ లో గతంలో ఒక సినిమా వచ్చింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన ఓ సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. కాని ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా వచ్చిన దాదాపు 7 సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ సూర్యతో కలిసి నటిస్తుంది. మరి ఈ చిత్రంతో అయిన కీర్తి సురేష్ ఫేట్ మారుతుందా చూడాలి. ఈ క్రమంలోనే అభిమానుల అంచనాలు నిలబెడుతూ వరస ప్రాజెక్ట్స్‌కే ఓకే చెప్తున్నారు ఈ కేరళ కుట్టి. రివాల్వర్ రీటా, కన్నివేడి సినిమాలతో త్వరలోనే రానున్నారు కీర్తి. ఈ సినిమాలెప్పుడో సైన్ చేసినవి.. వాటితో పాటు నెట్ ఫ్లిక్స్ కోసం అక్క అనే సిరీస్ చేస్తున్నారీమే.ఈ టైమ్‌లోనే ఆంటోనీ తట్టిల్‌ను పెళ్లాడారు. డిసెంబర్‌లో పెళ్లయ్యాక కాస్త గ్యాప్ తీసుకుని తెలుగులో బలగం వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ, విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న రౌడీ జనార్ధన సినిమాలకు ఓకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇక మలయాళంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న హీరో టొవినో థామస్ సినిమాలోనూ హీరోయిన్‌గా ఖరారయ్యారు కీర్తి సురేష్. మొత్తానికి పెళ్లి తర్వాత చిన్న గ్యాప్ ఇచ్చి అన్ని ఇండస్ట్రీల్లోనూ మళ్లీ రచ్చ చేస్తున్నారు స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్.


TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339